RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ తల్లి

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :Boorla Venkatesham KARIMNAGAR VOLUME:18 ISSUE:16 MONDAY ,MAY 18,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :16 సోమవారం, మే 18, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## జూన్ 2 నుంచి కొత్త పెన్షన్లు: మంత్రి వివేక్ వెంకటస్వామి



తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఈ ఏడాది జూన్ 2వ తేదీ నుంచి కొత్త పెన్షన్లను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ హయాంలో ఒక్క పెన్షన్ కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఆదివారం మిర్యాలగూడలో మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు - మిగతా2లో

## మూడేళ్లలో తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని అడిగింది 85,677 కోట్లు ఇచ్చింది 28,065 కోట్లు



తెలంగాణ పత్రిక ప్రతినిధి

దేశాన్ని పరిపాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తోంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2023--24 ఆర్థిక సంవత్సరం నుంచి 2026 మార్చి 31 వరకు ఈ మూడేళ్లలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ. 85,677.82 కోట్లు కేంద్రాన్నిఅడిగితే ఇచ్చింది మాత్రం రూ. 28,065.97 కోట్లు మాత్రమేనని కాగ్ పత్రాలు వెల్లడిస్తున్నాయి. - మిగతా2లో

## భారత్ అమ్ములపొదిలో 'ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ కిల్లర్' క్షిపణి

తెలంగాణ పత్రిక ప్రతినిధి

రక్షణ రంగంలో స్వయం సమృద్ధి దిశగా భారత్ మరో భారీ ముందడుగు వేసింది. శత్రు దేశాల భారీ యుద్ధ నౌకలను, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లను సైతం సముద్రంలోనే జలసమాధి చేయగల అత్యంత శక్తివంతమైన హైపర్‌సోనిక్ క్షిపణిని అభివృద్ధి చేసింది. దీనిని 'ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ కిల్లర్'గా అభివర్ణిస్తున్నారు. హిందూ మహాసముద్రంలో చైనా కదలికలకు చెక్ పెట్టేలా దీనిని రూపొందించడం - మిగతా2లో



## శాంతి చర్చలు.. ఇరాన్ ముందు అమెరికా ఐదు కఠిన షరతులు

- యుద్ధ నష్టపరిహారం ఇవ్వబోమని స్పష్టం
- 400కిలోల యురేనియం ఇవ్వాలని డిమాండ్
- స్తంభించిన నిధుల విడుదలకు నిరాకరణ
- ఇరాన్ సైతం ఐదు షరతులు
- పరిహారం ఇవ్వాల్సిందేనని పట్టు

2



## అటవీ సంపదను దోచుకుంటున్నారు.. ఆదివాసీలను వదిలేశారు




తెలంగాణ పత్రిక ప్రతినిధి

భారతదేశ స్వాతంత్ర్యానికి ముందు నుంచే ఆదివాసీలు తమ హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నారని పౌర హక్కుల ఉద్యమ నేత, ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివాసీల చరిత్ర అంతా పోరాటమయం అని చెప్పారు. - మిగతా2లో

## ఆ ఆరు రోజులు తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వర్షమే!

తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండలు దంచికొట్టనున్నాయి. రానున్న వారం రోజుల పాటు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా మే 19 నుంచి 24వ తేదీ వరకు ఆరు రోజుల పాటు భానుడి ప్రతాపం చుక్కలు చూపించనుందని, బలమైన - మిగతా2లో



## నీట్ లీక్ కేసులో ప్రొఫెసర్ మనీషా అరెస్ట్

తెలంగాణ పత్రిక ప్రతినిధి

నీట్ యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ కేసు దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) వేగవంతం చేసింది. ఈ కేసులో పుణెకు చెందిన సీనియర్ బోటనీ టీచర్ మనీషా గురునాథ్ మాంధరేను శనివారం అధికారులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో దేశంలోని వివిధ - మిగతా2లో



## బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి: కేటీఆర్

తెలంగాణ పత్రిక ప్రతినిధి

పోక్సో చట్టం కింద బండి భగీరథ్ అరెస్ట్ అయిన నేపథ్యంలో ఈ కేసు నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని ప్రధాని మోదీని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. - మిగతా2లో




## అర్చక నియామకాలలో అంతర్గత ఒప్పందాలా..

తెలంగాణ పత్రిక ప్రతినిధి

కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థాన అర్చక నియామకాల వ్యవహారం రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతోంది. ఇప్పటికే వంశపారంపర్య అర్చకులకు మాత్రమే అవకాశాలు కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తుండగా, తాజాగా మరో సంచలన అంశం వెలుగులోకి వచ్చినట్టు తెలుస్తోంది. దేవాలయ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, కొండగట్టు అర్చకుల నియామకాలకు - మిగతా2లో



## జూన్ 2 నుంచి కొత్త పెన్షన్లు: మంత్రి వివేక్ వెంకటస్వామి

-మొదటిపేజీ తరువాయి

కోడి రెక్క శౌరి అంత్యక్రియలో పాల్గొని నివాళులు అర్పించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేస్తాం..

ధాన్యం కొనుగోలులో తమ ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో అందించి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. మిర్యాలగూడ, నకిరేకల్‌లలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేస్తామని.. ఇందుకు సంబంధించిన పనులను త్వరలో ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కార్మికుల రక్షణ కోసం ఆయా ఫ్యాక్టరీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఫార్మారంగంలో ప్రమాదాల నివారణకు నూతన విధివిధానాల ఏర్పాట్లకు తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

## శాంతి చర్చలు.. ఇరాన్ ముందు అమెరికా ఐదు కఠిన షరతులు

-మొదటిపేజీ తరువాయి

ఇరాన్‌తో జరుగుతున్న శాంతి చర్చల్లో అమెరికా ఐదు కఠిన షరతులు విధించింది. ఇప్పటి వరకు ఇరాన్‌కు జరిగిన నష్టాలకు ఎలాంటి పరిహారం చెల్లించే ప్రసక్తి లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ఓ నివేదికను విడుదల చేసింది. ఇరాన్ తన వద్ద ఉన్న 400 కిలోల శుద్ధిచేసిన యురేనియంను తమకు అప్పగించాలని అమెరికా డిమాండ్ చేసింది. అలాగే ఇరాన్‌లోని అణు కేంద్రాల్లో కేవలం ఒక్కదానికి మాత్రమే అనుమతి ఇస్తామని పేర్కొంది. విదేశాల్లో స్తంభించిపోయిన ఇరాన్ ఆస్తుల్లో కనీసం 25 శాతాన్ని కూడా విడుదల చేయబోమని తెలిపింది. వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణల ముగింపు ఈ చర్చల పురోగతిపైనే ఆధారపడి ఉంటుందని అమెరికా లింక్ పెట్టింది. ఈ ఐదు షరతులకు ఇరాన్ అంగీకరించినా అమెరికా, ఇజ్రాయెల్ నుంచి ముప్పు అలాగే కొనసాగుతుందని వైనెట్ న్యూస్ అభిప్రాయపడింది. మరోవైపు ఇరాన్ కూడా చర్చల కోసం ఐదు షరతులను విధించింది. ముఖ్యంగా లెబనాన్‌లో ఘర్షణలు ఆపాలని, తమపై ఆంక్షలు ఎత్తివేయాలని, స్తంభించిన నిధులను విడుదల చేయాలని కోరింది. యుద్ధ నష్టపరిహారంతో పాటు హర్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమాధికారాన్ని గుర్తించాలని డిమాండ్ చేసింది.

## భారత్ అమ్ములపొదిలో 'ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ కిల్లర్' క్షిపణి

-మొదటిపేజీ తరువాయి

రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) ఈ లాంగ్ రేంజ్ యాంటీ-షిప్ హైపర్‌సోనిక్ మిస్సైల్ (ఎల్ఆర్-ఏఎస్ హెచ్‌ఎం)ను దేశీయంగా అభివృద్ధి చేసింది. ఇది సుమారు 1,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. గంటకు దాదాపు 12,000 కిలోమీటర్ల (మాక్ 8 నుంచి 10) అసాధారణ వేగంతో ప్రయాణించడం దీని అతిపెద్ద బలం. ఈ వేగం కారణంగా శత్రువుల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు దీనిని గుర్తించి అడ్డుకోవడం దాదాపు అసాధ్యం. ఒక వేళ రాడార్ పై కనిపించినా, శత్రు దేశాలు స్పందించేలోపే లక్ష్యాన్ని ఛేదించగల సామర్థ్యం ఆ మిస్సైల్ సొంతం. ఇది 1500 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 7 నిమిషాల 30 సెకన్లలోనే చేరుకుంటుంది అంటే దీని సత్తా ఏంటో అర్థమవుతుంది. చైనా నిర్మించిన అత్యాధునిక 'ఫ్యుజియాన్' విమాన వాహక నౌకను కూడా ఇది నిమిషాల్లో ధ్వంసం చేయగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఈ క్షిపణి, భారత నౌకాదళంతో యూజర్ ట్రయల్స్‌కు సిద్ధమవుతోంది. ఇటీవల ఒడిశా తీరంలో జరిపిన పరీక్షలు విజయవంతమయ్యాయి. 2027-28 మధ్యలో తుది ట్రయల్స్ ప్రారంభించి, 2029-30 నాటికి పూర్తిస్థాయిలో నౌకాదళంలోకి ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యంలో భాగంగా రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టు ఓ కీలక మైలురాయిగా నిలవనుంది. ఈ క్షిపణి వ్యవస్థ అందుబాటులోకి వస్తే హిందూ మహాసముద్రంలో భారత భద్రతా సామర్థ్యం, నిరోధక శక్తి కొత్త శిఖరాలకు చేరుకుంటాయి. సముద్ర తీర ప్రాంత రక్షణ మరింత పటిష్ఠం కానుంది.

## నీట్ లీక్ కేసులో ప్రొఫెసర్ మనీషా అరెస్ట్

-మొదటిపేజీ తరువాయి

మొత్తం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. మనీషా మాంధరే పుణె శివాజీనగర్‌లోని 'మోడ్రన్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్, సైన్స్ అండ్ కామర్స్'లో పనిచేస్తున్నారు. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)లో సబ్జెక్ట్ నిపుణురాలిగా ఉన్నందున ఆమెకు బోటనీ, జువాలజీ ప్రశ్నపత్రాలను చూసే అవకాశం లభించింది. ఈ క్రమంలోనే మే 3న జరిగిన పరీక్షకు ముందే ఆమె ప్రశ్నలను లీక్ చేశారని సీబీఐ ఆరోపించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆమె మరో నిందితురాలు మనీషా వాఘ్మారే సహాయంతో కొంతమంది నీట్ అభ్యర్థులను ఎంపిక చేశారు. పుణెలోని తన ఇంట్లోనే విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ తరగతులు నిర్వహించారు. ఆ సమయంలో ముఖ్యమైన ప్రశ్నలను నోట్‌బుక్స్‌లో రాయించి, టెక్ట్స్‌బుక్స్‌లో మార్క్ చేయించినట్లు దర్యాప్తులో తేలింది. ఆ ప్రత్యేక తరగతుల్లో చెప్పిన ప్రశ్నల్లో చాలావరకు నీట్ బయాలజీ పరీక్ష పేపర్‌తో సరిపోలాయి. ఈ వ్యవహారంలో ఎన్‌టీఏ అంతర్గత వ్యక్తులు, మధ్యవర్తులు పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి ప్రశ్నలను చేరవేసినట్లు ఏజెన్సీ అనుమానిస్తోంది. కేంద్ర విద్యాశాఖ ఫిర్యాదు మేరకు మే 12న సీబీఐ ఈ కేసును నమోదు చేసింది.

# మూడేళ్లలో తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని అడిగింది 85,677 కోట్లు ఇచ్చింది 28,065 కోట్లు

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రం నుంచి బీజేపీకి 8 మంది ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులున్నా రాష్ట్రానికి ఒనగూడిన ప్రయోజనం ఏమి లేదని, కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో ఘోరంగా విఫలమయ్యారని కాగ్ లెక్కలే తెలియజేస్తున్నాయి. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం స్వంత ఆదాయం పైనే ఎక్కువగా ఆధారపడుతున్నది. ఖర్చులకు తగిన ఆదాయం రాకపోవడంతో అప్పులపైనే ఎక్కువగా ఆధారపడాల్సిన అనివార్య పరిస్థితి తెలంగాణ ప్రభుత్వానికి ఏర్పడింది.

2023-24 నుంచి 2026 మార్చి వరకు కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్స్ (రూ. కోట్లలో)

| సంవత్సరం | ఎస్టిమేట్ | వచ్చింది | శాతం |
|---|---|---|---|
| 2023--24 | 41,259.17 | 9729.91 | 23.58 |
| 2024--25 | 21636.15 | 7913.08 | 36.57 |
| 2025--26 | 22782.50 | 10,422.98 | 45.75 |

(కాగ్ పత్రాలు ఆధారం)

రాష్ట్ర ఆదాయాలు, ఖర్చుల మధ్య లోటు భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఇస్తుంది. ముఖ్యంగా ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, ఆరోగ్యం, విద్య, రైతు సంక్షేమ పథకాల అమలుకు లోటును పూడ్చటానికి వీటిని ఉద్దేశిస్తుంది. అలాగే ప్రాంతీయ అసమానతలు తగ్గించడానికి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక గ్రాంట్లు కూడా ఇస్తుంది. మరో వైపు కేంద్ర ప్రభుత్వ పథకాలైన జల్ జీవన్ మిషన్, పీఎంఏవై, ఎన్‌హెచ్‌ఎం, విద్యా పథకాలకు సహాయం చేస్తుంది. వరదలు, కరువు, తుఫాన్లు, భూకంపాల సందర్భాల్లోనూ ప్రత్యేక గ్రాంట్లు ఇస్తుంది. ఆదివాసీ ప్రాంతాల వృద్ధి, రాష్ట్రాల ప్రత్యేక అవసరాలు, ఆర్థికంగా బలహీన రాష్ట్రాల కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 275 ప్రకారం గ్రాంట్స్ ఇస్తారు. ముఖ్యంగా ఇలా ఇచ్చే గ్రాంట్లు ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు విడుదల చేయాలి. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆర్థిక సంఘం చేసిన సిఫారసులు కేంద్రం ప్రకటించే ప్రాయోజిత పథకాలు, వాటికోసం రాష్ట్రానికి చేసిన కేటాయింపుల మేరకు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద కేంద్రం నుంచి వచ్చే ఆదాయాన్ని అంచనావేసి బడ్జెట్‌లో పొందుపరుస్తారు.

ఆర్థిక సంఘం సిఫారసులు పట్టించుకోనికేంద్రప్రభుత్వం తెలంగాణపై కక్ష కట్టిందా?

ఆర్థిక సంఘం సిఫారసులు కూడా పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై కక్ష కట్టిందా? అనే సందేహాలు వెలువడుతున్నాయి. చిన్నచిన్న కారణాలు చూపి కేంద్రం రాష్ట్రానికి గ్రాంట్స్ విడుదల చేయడం లేదన్నఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి ఆర్థిక సంఘం సిఫారసులతో పాటు కేంద్ర ప్రాయోజిత పథకాలు, విపత్తుల నిర్వహణ నిధి, పట్టణాభివృద్ధికి గ్రాంట్స్ రావాలి. కానీ యుటిలైజేషన్ సర్టిఫికెట్ సమయానికి ఇవ్వడం లేదన్న కారణం చూపి నిధులు విడుదల చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది జనవరిలోనే ఫైనాన్స్ కమిషన్ నిధులు మూడు వేల కోట్లు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ కూడా రాసింది. దీనిని బట్టి పరిశీలిస్తే రాజకీయ కారణాలతోటే కేంద్రం నిధులు ఇవ్వకుండా రాష్ట్రాన్నిఇబ్బందులకు గురి చేస్తున్నదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు విడుదల చేయక పోవడంతో అప్పుల వైపు!

కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం లోటును పూడ్చుకోవడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో స్వంత ఆదాయ వనరులు తగ్గిపోయాయి. కేంద్రం ఎంత మేరకు ఇవ్వాలో అంత మేరకు గ్రాంట్స్ ఇవ్వడం లేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన రోజు నుంచి బీజేపీ ప్రభుత్వం ఇదేరకమైన వివక్ష చూపిస్తున్నదన్న అభిప్రాయం తెలంగాణ సమాజంలో ఏర్పడింది. అందుకే కాబోలు కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌లకు కేంద్రం జాతీయ హోదా ఇవ్వలేదు. ఫలితంగా లక్ష ల కోట్ల రుణం కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం తీసుకోవాల్సి వచ్చింది.

# అటవీ సంపదను దోచుకుంటున్నారు.. ఆదివాసీలను వదిలేశారు

-మొదటిపేజీ తరువాయి

అడవులను కాపాడేందుకు వారు ఇప్పటికీ పోరాటాలు చేస్తూనే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. హనుమకొండలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఐక్యత సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ హరగోపాల్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట నారాయణ, ఆదివాసీ హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్, ఆదివాసీ సంఘాల నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. ఆదివాసీల పట్ల పాలకులు వివక్ష చూపుతున్నారని అన్నారు. అభివృద్ధి కంటే అణచివేతనే కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి హామీలు ఇచ్చారే కానీ, పాలకులు ఏనాడూ వాటిని అమలు చేయలేదని ఆరోపించారు. అటవీ సంపదను దోచుకుపోతున్న వారే తప్ప, ఆదివాసీలకు భరోసా ఇచ్చే వారు లేకుండా పోతున్నారని చెప్పారు. ఖనిజ సంపదను తరలించుకుపోతున్నారే కానీ, అడవి బిడ్డల అభ్యున్నతిని విస్మరిస్తున్నారని హరగోపాల్ మండిపడ్డారు. పెట్టుబడి దారులకు పాలకులు కొమ్ముకాస్తున్నారని, ఆదివాసీలను అణచివేతకు గురి చేస్తున్నారని ఆగ్రహించారు. ఆదివాసీలందరూ ఎలాంటి స్వార్థం లేని వారని, అందుకే అడవులు అంతరించిపోకుండా కాపాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ఆదివాసీలు అందరూ సంఘటితమై పాలకులను నిలదీయాలని ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపునిచ్చారు.

# ఆ ఆరు రోజులు తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వర్షమే!

-మొదటిపేజీ తరువాయి

ఈ రోజుల్లో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటి రికార్డు స్థాయిలో నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం, ఈ ఆరు రోజుల్లో వడగాల్పుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉండనుంది. దీనివల్ల వడదెబ్బ తగిలి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని స్పష్టం చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా తాగునీటి బాటిల్‌ను వెంట ఉంచుకోవాలని, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, రోగులు ఈ కాలంలో ఎండకు దూరంగా, సురక్షితమైన ప్రదేశాల్లోనే ఉండటం శ్రేయస్కరం.

# బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి: కేటీఆర్

-మొదటిపేజీ తరువాయి

ఆదివారం ఎల్ బీ నగర్‌లో నిర్వహించిన 'నా బూత్.. నా భవిష్యత్తు' కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. ప్రధాని మోదీ 'బేటీ పడావో.. బేటీ బచావో' అంటున్నారన్నారు. కేవలం ఇది నినాదాలకే పరిమితమైతే న్యాయం జరగదని పేర్కొన్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారి కేంద్రమంత్రి కుమారుడి మీద లుకౌట్ నోటీస్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని చెప్పారు. బండి సంజయ్‌ను కేంద్రమంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయకపోతే ఈ కేసు విచారణ సజావుగా జరిగే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తప్పు చేసిన కొడుకుని తొమ్మిది రోజులు దాచి పెట్టారంటూ కేంద్రమంత్రి సంజయ్‌పై ఆయన నిప్పులు చెరిగారు. సంజయ్ లాంటి వ్యక్తి పదవిలో కొనసాగడం తెలంగాణకే కాదు.. భారతదేశానికి కూడా అవమానకరమన్నారు. కేంద్ర మంత్రి కొడుకు మైనర్ బాలికకు అన్యాయం చేశాడని విమర్శించారు. మైనర్ బాలిక తల్లిదండ్రుల్ని స్వయాన కేంద్ర మంత్రి భయభ్రాంతులకు గురిచేశారని గుర్తు చేశారు. ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేసింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ఆరోపించారు. హనీ ట్రాప్ అని, మీడియాను మనీ ట్రాప్‌లో వేసి.. సీఎం రేవంత్, కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఇద్దరూ మీడియాలో వార్తలు రానీవ్వకుండా చేశారని మండిపడ్డారు. కేంద్ర మంత్రి పదవి నుంచి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే తన మీద అఘాయిత్యం జరిగినా ముందుకు వచ్చే ధైర్యం ఏ ఆడబిడ్డ చేయదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే బండి సంజయ్‌ను కేంద్రమంత్రి పదవి నుంచి తొలగించి.. ఈ కేసు విచారణను నిష్పక్షపాతంగా జరిపించాలని కేంద్రానికి ఆయన స్పష్టం చేశారు. కేంద్రమంత్రి ఎన్ని రకాలుగా బెదిరింపులు, ఒత్తిళ్లు తెచ్చినా బాధిత బాలికకు తల్లి అండగా నిలబడిందన్నారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ఇద్దరూ కుమ్మక్కై ఆ అమ్మాయికి అన్యాయం చేయాలనుకున్నా.. ఆ తల్లిదండ్రులు వెనకడుగు వేయలేదని తెలిపారు. బాలిక తరపున పోరాటం చేసిన బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగానికి ఈ సందర్భంగా కేటీఆర్ అభినందనలు తెలియజేశారు. బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కూడా ఈ కేసులో చాలా గట్టిగా కొట్లాడారని గుర్తు చేశారు.

# అర్చక నియామకాలలో అంతర్గత ఒప్పందాలా..

-మొదటిపేజీ తరువాయి

మన్నెంకొండ (మన్యంకొండ) దేవస్థానానికి చెందిన అర్చకులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తుండగా, మన్నెంకొండ దేవస్థాన నియామకాల సమయంలో తిరిగి కొండగట్టు అర్చకులే అక్కడ ఇంటర్వ్యూ కమిటీలో పాల్గొంటున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. ఇలా ఒకరికి ఒకరు సహకరించుకుంటూ,తమ వంశపారంపర్య కుటుంబాలకు చెందిన వారికే ఉద్యోగాలు వచ్చేలా పరస్పర అవగాహనతో వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నేడు మీ వాళ్లకు,రేపు మా వాళ్లకు అన్నట్టుగా రెండు దేవస్థానాల మధ్య ఒక రహస్య ఒప్పందం జరిగినట్టుగా ప్రచారం జరుగుతుండడం మరింత చర్చనీయాంశమైంది.

ఇంటర్వ్యూలు పేరుకేనా..?

ఉద్యోగాల కోసం ఆశతో వచ్చిన ఇతర అర్చక అభ్యర్థులు మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.ముందే ఎవరికివ్వాలో నిర్ణయించుకుని, ఇంటర్వ్యూలు కేవలం నిబంధనల కోసం నిర్వహిస్తున్నారు,అంటూ కొందరు అభ్యర్థులు ఆరోపిస్తున్నారని తెలుస్తోంది. కొంతమంది అర్చకుల అభిప్రాయం ప్రకారం, దేవాలయాల్లో అర్చకత్వం అనేది సేవా భావంతో పాటు అర్హతల ఆధారంగా ఇవ్వాల్సిన బాధ్యత కాగా, కొంతమంది మాత్రం తమ కుటుంబాలకే పరిమితం చేసే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు.

దేవాదాయ శాఖ జోక్యం చేసుకోవాలంటున్న అభ్యర్థులు.

ఈ మొత్తం వ్యవహారంపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని,ఇంటర్వ్యూ కమిటీల ఎంపికలో పారదర్శకత తీసుకురావాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఇంటర్వ్యూల ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డింగ్ చేయడంతో పాటు,బయటి జిల్లాలకు చెందిన స్వతంత్ర సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

దేవాలయ వర్గాల్లో హాట్ టాపిక్.

ఇప్పటికే కొండగట్టు అర్చక నియామకాలపై వచ్చిన వార్తకు భారీ స్పందన రావడంతో,ఈ తాజా ఆరోపణలు మరింత కలకలం రేపుతున్నాయి.వాస్తవంగా దేవస్థానాల మధ్య పరస్పర సహకార ఒప్పందం ఉందా? లేక ఇది అసంతృప్త వర్గాల ఆరోపణలేనా? అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

# నూతన సాంప్రదాయానికి శ్రీకారం చుట్టిన ఓదెల సర్పంచ్ సతీష్

ఓదెల/తెలంగాణ పత్రిక (మే 17)

ఓదెల గ్రామ సర్పంచి కనకిరెడ్డి సతీష్ ఆధ్వర్యంలో పాలకవర్గం అంతా కలిసి నూతన సాంప్రదాయానికి శ్రీకారం చుట్టారు పెళ్ళిరోజు పుట్టిన రోజు లకు చెట్లు నాటుదాం గ్రామాన్ని హరితహారంగా చేద్దాం అని వెంటనే శ్రీకారం చుట్టారు ఆదివారం వార్డ్ సభ్యులు చింతం విజయ స్వామి ల పెళ్లి రోజు సందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణలో చెట్లు నాటారు ఈ సందర్భంగా సర్పంచ్ కనిగిరి సతీష్ మాట్లాడుతూ చెట్టు నాటడం వల్ల గ్రామం మొత్తం ఒక హరితహారం గా మారి చల్లటి నీడనిస్తూ గ్రామాన్ని సస్యశ్యామలం చేయాలని మంచి ఆలోచనతో ఈ కార్యక్రమం మొదలుపెట్టడం జరిగిందని గ్రామంలో చెట్లు వేపుగా ఉండటం వల్ల మంచి వాతావరణాన్ని కల్పిస్తాయని చెట్లను మనం కాపాడితే ఆ తర్వాత ఆ చెట్టు మనలను కాపాడతాయని అన్నారు అదేవిధంగా ఇటీవల మా పెళ్ళిరోజు జరుపుకున్న సందర్భంగా కూడా చెట్లు నాటడం జరిగిందని అదేవిధంగా వార్డ్ సభ్యులు దూలంసదానందం స్వరూప దంపతులు కూడా చెట్లు నాటడం జరిగిందని అన్నారు ఇలాంటి మంచి కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించినందుకు వారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తూ ప్రతి ఒక్కరు సహకరించి గ్రామ అభివృద్ధికి తోడ్పడుతున్నారని ఇక నుండి పాలకవర్గ సభ్యులు పెళ్లి రోజు పుట్టినరోజున లాంటి శుభకార్యాలకు గ్రామంలో చెట్లు నాటడానికి సమిష్టి నిర్ణయం తీసుకొని ప్రతి సభ్యులు కూడా గ్రామ అభివృద్ధికి పచ్చదనానికి కృషి చేయాలని కోరారు . ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ కీర్తి దంపతులు వార్డ్ సభ్యులు చింతం విజయ కుమారస్వామి,దూలం సదానందం స్వరూప, బుద్ధ తిరుమల రవి ,అప్పని తిరుపతి,చింతం తిరుపతి,





రాపెల్లి రాజయ్య,రాచర్ల అశోక్, కొంద్ర లక్ష్మణ్,తోట ఉమామహేశ్వరి మరియు గోపతి ప్రవీణ్, పెండం ఓదెలు,సిరిగిరి రాజారాం తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు

ఓదెల/ తెలంగాణ పత్రిక (మే 17)

ఓదెల మండలంలోని కొలనూరు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలలో భాగంగా పాఠశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిట్టూరి ఏసుదాసు ఉపాధ్యాయులు .మల్లయ్య మరియు గణిత ఉపాధ్యాయులు మందల శ్రీనివాస్ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కొలిపాక అశ్విత, జోయా ఫిర్దోస్ , చీదురు అక్షయ్ అనే విద్యార్థులను అలాగే వివిధ క్రీడాంశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి నేషనల్ స్థాయికి వెళ్లిన రేండ్ల శ్రావ్య శ్రీ మరియు రేండ్ల సౌమ్యశ్రీలను అభినందిస్తూ శాలువలతో సన్మానించారు. అదేవిధంగా శనివారం జరిగిన డ్రాయింగ్, పాటలు, పద్యాల పోటీలలో మొదటి మూడు స్థానాలు సాధించిన కొలిపాక అశ్విత, నిత్యశ్రీ ,చిలుక కావ్యశ్రీ, చిలుక అలంకృతి, పల్లె అస్మిత విద్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఉత్సాహంతో పాఠశాలలో ఎలాంటి పోటీ పరీక్షల్లోనైనా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారని





పిల్లలకు చదువుతోపాటు క్రీడలు కూడా ప్రధానమైనవేనని తప్పకుండా పిల్లలు కూడా ఇలాగే ముందుకు వెళ్లి ఇంకా ఉత్తమమైన ఫలితాలు సాధించి జిల్లా స్థాయిలో కాదు రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మోడీది స్వదేశీ నినాదం విదేశీ వ్యామోహం





-పొదుపు సూత్రాలు ప్రజలకేనా ప్రధాన మంత్రికి వర్తించవా
-పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యులపె ప్రభావం
-పెట్రోల్,డీజిల్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ సిపిఎం నిరసన
-సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 17

ప్రధానమంత్రి మోడీది స్వదేశీ నినాదం విదేశీ వ్యామోహం అని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను నిరసిస్తూ ఆటో కి తాడు కట్టి లాగుతూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మోడీ తాను వేసుకునే కోర్టు తాగే నీళ్లు చేతులు పెట్టుకునే వాచి విదేశీ వాడుతూ ప్రజలకు మాత్రం స్వదేశీ నినాదం ఇస్తున్నారని మోడీ స్వదేశీ నినాదం పొదుపు సూత్రాలు సామాన్య ప్రజలకేనా ఆయనకు వర్తించవా అని ప్రశ్నించారు. ప్రధానమంత్రి చెబుతున్న పొదుపుమంత్రంలో దేశాభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ప్రభావం ప్రజలపై నేరుగా పడుతుందనీ, గ్యాస్ ధరల పెంపుతో ఇప్పటికే అనేక పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గ్యాస్ ధరలను రెండు దఫాలుగా పెంచిందని విమర్శించారు. ఈ ధరల పెంపు దేశ ఆర్థిక వ్యవస్థపైనా, సామాన్య ప్రజానీకంపైనా తీవ్ర భారాన్ని మోపుతుందని తెలిపారు. ఇరాన్– అమెరికా, ఇజ్రాయిల్ మధ్య యుద్ధం జరుగుతున్నది కాబట్టి పొదుపు చర్యలు చేపట్టాలని ప్రధాని మోడీ చూపడం విడ్డూరంగా ఉందన్నారు. తాము అప్పుడే చెప్పామనీ పొదుపుమంత్రం చెప్పి పొదుపు పాటించట్లేదు కాదు కాబట్టి ధరలు పెంచుతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నేరం చేసేవాడు ఒకడైతే ప్రజలకు శిక్ష? వేసే పరిస్థితి నేడు నెలకొందని తెలిపారు. అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం ఆగితే ఈ ధరలు పెంచాల్సిన అవసరం ఉండదన్నారు. అయితే, ప్రధాన మంత్రి మోడీ యుద్ధ నివారణ చర్యలు తీసుకోకుండా, అమెరికాకు దాసోహం అయిపోయి ట్రంప్‌కు సాష్టాంగ నమస్కారం చేస్తూ ప్రజలు మాత్రం ధరల భారాలను భరించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అంతకుముందు పొదుపు చర్యలు కనిపించలేదా? అని ప్రశ్నించారు. యూరియాను మానేయండి..విదేశీ ప్రయాణాలు ఆపండి బంగారం కొనకండి. ఆఫీసులకు వెళ్లకుండా వర్క్‌ఫ్రమ్ హోం చేయండి అనటం సరిగాదనీ, అవన్నీ చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థ ఏం కావాలని ప్రశ్నించారు. ఉత్పత్తి దెబ్బతిన్న తర్వాత దేశ అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. యుద్ధం చేస్తున్న వారికి మద్దతిచ్చేలా మోడీ విదేశీ పర్యటనలు ఉంటున్నాయని విమర్శించారు. అమెరికాకు దాసోహం అనడం వల్లనే ఈరోజు ఇరాన్ నుండి హార్మోస్ జల సంధి ద్వారా రావలసిన పెట్రోల్ డీజిల్ రవాణా ఆగిపోవడం వలన ప్రజలపై పెట్రోల్ డీజిల్ వారాలు మోపుతున్నారని అన్నారు. తాను విశ్వగురు అని డాంబికలు పలికే మోదీ గారు యుద్ధాన్ని ఆపి అమెరికా మీద ఒత్తిడి తెచ్చి హార్మోజ్ జల సంధిని తెరిపించలేరా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ లిక్కి బాలరాజు రేపాకుల శ్రీనివాస్ జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ నాయకులు నందిపాటి రమేష్ నాగకృష్ణ సతీష్ బాలకృష్ణ రాములు సలీం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

-జిల్లా కలెక్టర్ అంకిత్.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 17

మే, 18 వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని,





ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# చార్వాక వృద్ధుల ఆశ్రమ స్థలంలో సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టవద్దు



చందుర్తి, మే 17,తెలంగాణ పత్రిక.

చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో చార్వాక వృద్ధుల ఆశ్రమ స్థలంలో సబ్ స్టేషన్ ను నిర్మించాలని చేస్తున్న ప్రయత్నన్ని విరమించాలని, సబ్ స్టేషన్ వేరే ప్రాంతంలోకి మార్చాలని చార్వాక వృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డప్పుల అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా డప్పుల అశోక్ మాట్లాడుతూ,చార్వాక వృద్ధుల ఆశ్రమంలో సబ్ స్టేషన్ నిర్మాణం చేపడితే వృద్ధులకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని వెంటనే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విరమించుకోవాలన్నారు. అభివృద్ధికి చార్వక ట్రస్టు అడ్డు కాదని, గ్రామపంచాయతీ తీర్మానం చేసిన స్థలంలో సబ్ స్టేషన్ నిర్మించాలన్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఇతర ప్రాంతంలో స్థలం ఉందని గ్రామపంచాయతీ కూడా ఇతర ప్రభుత్వ స్థలంలో సబ్ స్టేషన్ నిర్మించడానికి సిద్ధంగా ఉందని ఇట్టి విషయాన్ని ఎమ్మెల్యే గమనించాలన్నారు. గత ఎమ్మెల్యే రమేష్ బాబు వృద్ధుల ఇబ్బందులను గుర్తు చేసుకొని వృద్ధులకు స్థలాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చార్వక వృద్ధుల సంఘం నాయకులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి,బొంత అశోక్ రావు, జలగం కిషన్ రావు, వాసం నారాయణ,గడ్డం ఉపేందర్ రెడ్డి, ఇందూరి హన్మాండ్లు,కొట్టె లింగయ్య, గొట్టే శంకరయ్య, ఎర్రం ఆశన్న,దయ్యాలా కమలాకర్, రాగుట్ల నరేష్, ఎల్లల గంగారెడ్డి,దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

## అతి వేగం -- మద్యం మత్తులో కారు డ్రైవర్ సృష్టించిన బీభత్సం



గూడూరు మండల ప్రతినిధి:- మే 17. (తెలంగాణ పత్రిక)

మహబూబాబాద్ జిల్లా, మహబూబాబాద్ నుండి మేడారం వైపు వెళ్తున్న ఓ కారు అతి వేగంగా, డ్రైవర్ మద్యం మత్తులో నిర్లక్ష్యంగా కారులో ప్రయాణిస్తూ... బొడ్డుగొండ వద్ద రోడ్ డామేజ్ ప్రాంతంలో అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటన అర్ధరాత్రి సుమారు 1:30 గంటల సమయంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో నంజాల వెంకటేశ్వర్లు కు చెందిన 5 గేదెలను కారు ఢీకొట్టింది. అందులో 3 పాడి గేదెలకు తీవ్ర గాయాలు కావడంతో నడుములు విరిగి పోయాయి. మరో 2 దూడలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటనతో రైతుకు సుమారు 3 లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులకు స్వల్ప గాయాలు కాగా, స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అతి వేగం అలాగే మద్యంమత్తులో వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# రహీంఖాన్‌పేట్ మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఇల్లంతకుంట, మే 17, తెలంగాణ పత్రిక

ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేట్ గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' విద్యా





వారోత్సవాల్లో భాగంగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ శ్రీమతి గరిమా అగర్వాల్, జిల్లా విద్యాధికారి చేతుల మీదుగా విద్యార్థులు పురస్కారాలు అందుకున్నారు. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో రహీంఖాన్‌పేట్ మోడల్ స్కూల్ విద్యార్థిని మెడకొక్కుల హర్షిణి 600 మార్కులకు 588 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో 8వ ర్యాంకు సాధించింది. హర్షిణికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమా అగర్వాల్ చేతుల మీదుగా రూ.10 వేల నగదు పురస్కారం, మెమెంటో అందజేశారు. 565 మార్కులకు పైగా సాధించిన 19 మంది విద్యార్థులు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఘన విజయం సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

## వడదెబ్బతో గంగిరెద్దుల ఆవుల సత్యం మృతి

-ఊరందరినీ నవ్వించిన గంగిరెద్దుల సత్యం... ఇకలేడు

కొత్తగూడ మండల ప్రతినిధి:- మే 17. (తెలంగాణ పత్రిక)



మహబూబాబాద్ జిల్లా, ఎండ తీవ్రత తట్టుకోలేక ఓ నిరుపేద గుండె ఆగిపోయింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండల కేంద్రంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన, గంగిరెద్దుల ఆవుల సత్యం 45 సంవత్సరాలు. వరంగల్ .. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. నాలుగు రోజుల క్రితం సత్యం ఒక దశదిన కర్మ కార్యక్రమానికి హాజరు అయ్యాడు. అక్కడ ఎండ తీవ్రతకు ఒక్కసారిగా కళ్ళు తిరిగి పడిపోవడంతో పాటు, చాతిలో తీవ్రమైన నొప్పి రావడంతో, కుటుంబ సభ్యులు ఆయనను నర్సంపేట ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం, వరంగల్ ఎంజీఎంకి తరలించారు. గత మూడు రోజులుగా మృత్యువుతో పోరాడుతూ, సత్యం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచాడు.

## మృతుని కుటుంబానికి పరామర్శ

-మృతుని కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయం
-మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు బుడిగే సతీష్ గౌడ్ అందజేత



గూడూరు మండల ప్రతినిధి:- మే 17. (తెలంగాణ పత్రిక)

మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు తంగళ్ళపల్లి వెంకన్న, ఇటీవలే గుండెపోటు తో మృతి చెందగా, వారి స్వగృహానికి వెళ్లి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన, గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్టా వెంకన్న, మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ కొమ్మాలు నాయక్, మహబూబాబాద్ జిల్లా నాయకుడు బుడిగే సతీష్ గౌడ్, జమ్ముల హేమలత రెడ్డి, గూడూరు మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ చంటి స్వామి లు, తంగేళ్ల పెల్లి వెంకన్న చిత్రపటానికి పూలమాలవేసి, ఘనంగా నివాళులు అర్పించారు, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తధానంతరం తంగళ్ళపల్లి వెంకన్న కుటుంబ సభ్యులకు, మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు బుడిగే సతీష్ గౌడ్ 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా ఎలమందల సంపత్ కుమార్ 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాసమల్ల యాకయ్య, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాసమల్ల రాములు, అర్రెమ్ వీరస్వామి, ఎలమందల శ్రీనివాస్, తంగళ్ళపల్లి సునీల్, పొన్నం వెంకన్న గౌడ్, చాంద్ పాషా, పంజరబోయిన శ్రీనివాస్, తంగళ్ళపల్లి కృష్ణ, రాజేష్, బుర్ర జోగయ్య గౌడ్, రాంప్రసాద్, తంగళ్ళపల్లి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా విజయోత్సవం - SSC లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం



వాజేడు తెలంగాణ పత్రిక, మే 17

ఈరోజు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ విద్యా వారోత్సవాలలో భాగంగా బి విద్య విజయోత్సవ –రూజ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు వాజేడు మండలంలో 2025 26 విద్యా సంవత్సరంలో పాసైన విద్యార్థులలో మొదటి ముగ్గురు విద్యార్థులకు సాల్వలతో తల్లిదండ్రుల సమక్షంలో సత్కరించడమైనది ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి శాఖ అధికారి శ్రీకాంత్ గారు మాట్లాడుతూ మీ భవిష్యత్తు కోసం ప్రణాళిక వేసుకోవడం ఒక కష్టమైన పనిలా అనిపించవచ్చు కానీ సరైన కెరియర్ మార్గదర్శకత్వం మరియు ఆలోచనత్మకమైన విధానంతో మీరు విజయవంతమైన భవిష్యత్తుకు పునాది వేసుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి తేజవతి వెంకటేశ్వరరావు గారు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు మార్గ నిర్దేశకులు అని పాఠశాల విద్యానుండే ఉన్నతంగా చదివి మంచి భవిష్యత్తుకును ఏర్పరచుకోవాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాజేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కోరిక స్వరూప్ సింగ్, శ్రీకాంత్, మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కష్టపడ్డ వారికే చైర్మన్ పదవి దక్కాలి

-అధిష్ఠానం ఆశీస్సులు తనకే నన్న మసిరెడ్డి వెంకటరెడ్డి

మంగపేట,మే17(తెలంగాణ పత్రిక)

మంగపేట మండల సొసైటీ చైర్మన్ పదవిని ఈసారి నామినేటెడ్ పద్ధతి ద్వారా భర్తీ చేసే అవకాశం ఉన్నందున, పార్టీ కోసం కష్టపడ్డ వారికే ఆ పదవి దక్కాలని పార్టీ జిల్లా నాయకుడు మసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గతంలో ఓటింగ్ విధానం ద్వారా జరిగే ఈ ఎంపిక ప్రక్రియ, ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయంతో నామినేటెడ్ విధానంలో జరగనుండటంతో అనేకమంది ఈ పదవిని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సహకార సంఘ బలోపేతానికి తాను చేసిన కృషిని వివరించారు. కొత్త వారికి సైతం అవగాహన కల్పించి సంఘంలో సభ్యత్వాలు చేయించడంలో కీలక పాత్ర పోషించానని గుర్తు చేశారు. తాను ఎన్నో సంవత్సరాలుగా పార్టీలో కిందిస్థాయి నుంచి పనిచేస్తూ, ప్రజల మన్ననలు పొందుతున్నానని తెలిపారు. నిరంతరం ప్రజల కష్టసుఖాలలో భాగస్వామినవుతూ, అవసరమైన వారికి ఆర్థిక సహకారం అందిస్తూ సేవ చేస్తున్నానని పేర్కొన్నారు. ఎంతోమంది ఈ పదవి కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, అర్హతను బట్టి తనకే సొసైటీ చైర్మన్ పదవి దక్కే అవకాశం ఉందన్నారు. సహచర నాయకులు సైతం తన అభ్యర్థిత్వానికే సుముఖంగా ఉండటం శుభసంకేతమని మసిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. పార్టీ అధిష్టానం నిర్ణయంతో తనకే చైర్మన్ పదవి దక్కుతుందనే ఆశాభావం వ్యక్తం చేస్తూ.. పదవి దక్కితే సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని, రైతులకు



ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పథకాలను రైతులకు చేరువ చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి





-సిపిఎం పార్టీ తోరూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆటోను తాళ్లతో గుంజుతూ నిరసన ..
-సిపిఎం పార్టీ జిల్లా నాయకులు బొల్లం అశోక్, ఎండి యాకుబ్.

పాలకుర్తి/తొర్రూరు (తెలంగాణ పత్రిక)పున్నం సారయ్య

ప్రజలపై భారాలు పడే పెట్రోల్ ,డీజిల్ గ్యాస్ ధరలను వీటిని తగ్గించాలని, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, ఎండి యాకుబ్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రోజు తొర్రూరు మండల కేంద్రంలోని గాంధీ సెంటర్లో సిపిఎం పార్టీ తోరూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ, ఆటోను తాళ్లతో కట్టి లాగుతూ నిరసన తెలియజేయడం జరిగింది. అనంతరం అశోక్, యాకుబ్ లు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పేద మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపుతూనే ఉన్నారు. ఇప్పటికే ప్రజలు నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతుంటే, మళ్లీ గ్యాస్ పెట్రోల్ డీజిల్ రేట్ల పెంపు సామాన్యుని నడ్డి విడిచే విధంగా ఉందని వారు ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు బిజెపి కేంద్ర మంత్రులు మాట్లాడుతూ, పెట్రోల్ డీజిల్ పై రేట్లు పెంచే ప్రసక్తే లేదని అన్నటువంటి మంత్రులు పెంచిన తర్వాత మాట మార్చి పెంచితే తప్పే ఉందని మాట్లాడడం చాలా విడ్డూరంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్ డీజిల్ రేట్లు పెరగడంతో సామాన్యులపై ఇతర నిత్యవసర వస్తువులపై కూడా ధరలు పెరిగే అవకాశం ఉందని ఇది సామాన్యుడికి బుద్ధి పండగ మారే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పంట గ్యాస్ పై పెంచి, సామాన్యులు ఇబ్బంది పడుతుంటే, కమర్షియల్ గ్యాస్ లపై విపరీతంగా పెంచడం వల్ల హోటల్లో చిన్న వ్యాపారులు ఇప్పటికే మూతపడ్డాయని, పెట్రోల్ డీజిల్ రేట్లు పెరిగితే రవాణా రంగం ఆటోలు టాక్సీలు మూలనబడి పేదలు మరింత ఇబ్బందులు పడే అవకాశం ఉందని వారు తెలిపారు ఇప్పటికైనా ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ రేట్లను తగ్గించాలని ప్రధానమంత్రి ఇతర దేశాలు విలాసవంతంగా తిరగడానికి ఉంటాయి, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేసుకోవడానికి వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నారు కానీ ప్రజలపై భారాలు పడకుండా మాత్రం ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఈ సందర్భంగా వారు అన్నారు. మోడీ విలాసాలకు అయ్యే ఖర్చు, వారి వ్యక్తిగత ప్రచారాలకు అయే ఖర్చును తగ్గించి, సామాన్యులపై బాణాలు పడకుండా సబ్సిడీలు ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని లేనియెడల ప్రజలందరిని కలుపుకొని ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వెంకటాచారి, సిపిఎం నాయకులు జమ్మల శ్రీను, మార్క సాంబయ్య, కొత్త వెంకటరెడ్డి, క్రాంతి కుమార్ సాయిలు లెనిన్, వసంత, వరలక్ష్మి, శోభ ,శమిన, భాగ్య సౌజన్య, గాలి ముట్టి శోభ, ప్రతిభ, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు, లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి









-కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంట ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు
-లారీల లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలో జాప్యం ఉండకూడదు
-కొనుగోలు సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలి
-కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మడిపల్లి కాలనీ, గంగారం ఐకేపీ కేంద్రాలు, అగ్రికల్చర్ మార్కెట్ యార్డు, మంగపేట అన్నదాత రైస్ మిల్లును పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, ప్రతినిధి మే17 ( తెలంగాణ పత్రిక )

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, లిఫ్టింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మడిపల్లి కాలనీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, గంగారం ఐకేపీ కేంద్రాన్ని, అగ్రికల్చర్ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న వరి ధాన్యం, మక్కల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మండలంలోని మంగపేట గ్రామంలో ఉన్న అన్నదాత రైస్ మిల్లును సందర్శించి ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా ప్రతిరోజూ లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. రైస్ మిల్లుల్లో అన్‌లోడింగ్ త్వరితగతిన పూర్తిచేయాలని, లారీల షెడ్లు పెండింగ్‌లో ఉండకుండా క్రమం తప్పకుండా క్లియర్ చేయాలని మిల్లర్లకు ఆదేశించా రు. రైతులకు కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు, రవాణా ప్రక్రియలనుసజావుగా నిర్వహించాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, పౌర సరఫరాల శాఖ సిబ్బంది రవీందర్, రాజి రెడ్డి,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలీల సమస్యలను పరిష్కరించేందుకు కృషి







-ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

పెద్దపల్లి, ప్రతినిధి మే 17 ( తెలంగాణ పత్రిక )

పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి ఆర్‌ఆర్ గార్డెన్ లో ఆదివారం రోజున పెద్దపల్లి జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాలోని పద్మశాలి ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు హాజరైయారు. అనంతరం జిల్లాలో కొత్తగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు విజయరమణ రావు మాట్లాడుతూ కుల వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న పద్మశాలీలకు ప్రభుత్వ పక్షాన అందించబడే అన్ని రకాల సంక్షేమ పథకాలను, సొసైటీలకు రాయితీలను అందే విధంగా చూస్తానన్నారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలన్నిటిని త్వరలోనే సంబంధిత చేనేత శాఖామంత్రి తుమ్మల నాగేశ్వర రావుని కలిసి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా సంఘం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు వేముల రామ్మూర్తి, రాష్ట్ర హ్యాండ్లూమ్, టెక్స్ టైల్స్ కార్పొరేషన్ చైర్మన్ దూరం వెంకటరమణ, పద్మశాలి సహకార కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకట్ల రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు వేముల బాలరాజు, ఓదెల మల్లికార్జున దేవస్థానం చైర్మన్ చీకట్ల మల్లయ్య, మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, జిల్లా సంఘం నాయకులు సాయిరి మహేందర్, బొద్దుల లక్ష్మన్, ఐల రమేష్, యాదగిరి, పద్మశాలి సంఘం మండల, పట్టణ శాఖల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు





-ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన మంచి ఫలితాలు ప్రతి ఒక్కరికి తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలి.
-మండలాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ సన్మానించాలి.
-ప్రతి హైస్కూల్ పరిధిలో టాపర్ విద్యార్థుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి.
-పిల్లలు చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా పేరేంట్స్ అప్రమత్తంగా ఉండాలి.
-ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

పెద్దపల్లి, ప్రతినిధి మే 17 ( తెలంగాణ పత్రిక )

ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం రోజున సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన విద్యా వారోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి ప్రభుత్వ విప్ విజయరమణ రావు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి 10వ తరగతి మరియు ఇంటర్ పరీక్షలో అధిక మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులను సన్మానిస్తూ, వారికి రూ.10 వేల చొప్పున నగదు బహుమతి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణరావు మాట్లాడుతూ. ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకున్న 98 మందికి పైగా విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించడం ఆనందదాయకమని తెలిపారు. ఈ ఫలితాల సాధనలో కృషి చేసిన ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునీకరణ పనులు, టాయిలెట్లు, అదనపు తరగతి గదులు, తాగునీటి సదుపాయాలు, చిన్నపాటి మరమ్మత్తులు వంటి అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి పూర్తి చేశారని అన్నారు. ప్రస్తుతం అనేక ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రంగా సందర్శించిన తెనుగువాడ పాఠశాల అప్పట్లో శిథిలావస్థలో ఉండేదని, అనంతరం దానిని పూర్తిగా ఆధునీకరణ చేసి ప్రజా ప్రభుత్వంలో అద్భుతంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడం సంతోషకరమన్నారు. పెద్దపల్లి పట్టణ పరిధిలో పదవ తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన 98 మంది విద్యార్థులు ఉన్నారని, మిగిలిన ఐదు గ్రామీణ మండలాల్లో 138 మందికి పైగా విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వీరందరికీ రాబోయే రోజుల్లో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మరింత గుర్తింపు లభించడంతో పాటు ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్లు చేసిన కృషి సమాజానికి తెలియజేసే అవకాశం ఉంటుందని అన్నారు. వచ్చే ఏడాది సన్మానించే విద్యార్థుల సంఖ్య రెట్టింపు కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన మంచి ఫలితాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని కలెక్టర్ సహా ఉన్నతాధికారులను ప్రభుత్వ విప్ సూచించారు. ప్రతి హైస్కూల్ పరిధిలో మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థుల ఫోటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఇంటర్ చదివే దశలో కొంతమంది విద్యార్థులు చెడు అలవాట్లకు గురయ్యే అవకాశమున్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా బండెల రాజశేఖర్

పెద్దపల్లి, ప్రతినిధి మే 17 ( తెలంగాణ పత్రిక )

జర్నలిస్టుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షులు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్, కానుగంటి రాజు లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా సీనియర్ జర్నలి స్ట్ తెలుగు ప్రభ దినపత్రిక పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ బండెల రాజశేఖర్ ఏకగ్రీవంగా ప్రకటించారు. ఆదివారం హన్మకొండ పట్టణంలోని ఆదర్శ లా కాలేజీలో జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రథమ సదస్సు రాష్ట్ర అధ్యక్షులు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు హనుమకొండ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా జర్నలిస్టుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సదస్సు సందర్భంగా రాష్ట్ర కమిటీని ప్రకటించారు. అందులో భాగంగా పెద్దపల్లి జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్టు ప్రస్తుతం తెలుగు ప్రభ దినపత్రిక పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గా పనిచేస్తున్న బండెల రాజశేఖర్ ను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగంటి రాజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లుగా ప్రకటించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం సంక్షేమం కోసం పోరాటం జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బండెల రాజశేఖర్ జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్గా తనపై నమ్మకంతో జాతీయ అధ్యక్షులు మానసాన్ని కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్ కానుగంటి రాజు ప్రకటించడంపై వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల కోసం వారి సంక్షేమం కోసం పోరాటం చేస్తానని తెలిపారు. జర్నలిస్టులను ఐక్యం చేస్తానని జర్నలిస్టుల సంక్షేమ సంఘం బలోపేతం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని బండెల రాజశేఖర్ తెలిపారు. త్వరలోనే పెద్దపెల్లి జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారీ సభ ఏర్పాటు చేయనున్నట్లుగా ప్రకటించారు.



# ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు

## అభినందించిన కళాశాల అధ్యాపకులు

తానూర్:17మే(తెలంగాణ పత్రిక)





తానూర్‌మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న విద్య వార్షికోత్సవాలలో ముగింపు సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్ష ,ఎస్ ఎస్ సి పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో కళాశాల ఆవరణ ఆనందోత్సాహాలతో కళకళలాడింది. వివిధ విభాగాలకు చెందిన ఇంటర్ విద్యార్థులు, అలాగే పదవ తరగతి విద్యార్థులు, అధిక మార్కులు సాధించి మంచి పేరు తీసుకురావడంతో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రత్యేక అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల కృషి, క్రమశిక్షణ, పట్టుదలే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. నిరంతర సాధనతోనే ఉన్నత ఫలితాలు సాధ్యమవుతాయని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ రవి కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమయపాలన, లక్ష్యసాధనపై దృష్టి పెట్టడం వల్లే మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు కూడా ప్రతిభ చాటడం ఆనందకరమన్నారు. భవిష్యత్తులో పోటీ పరీక్షలు, ఉన్నత విద్యలోనూ ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్.పారుక్ , మాజీ సర్పంచ్ మాధవరావు పాటిల్, వార్డు సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కుటుంబ కలహాల తో వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట, ప్రతినిధి మే 17:(తెలంగాణ పత్రిక)



కుటుంబ కలహాల తో ఓ వ్యక్తి చెట్టుకు ఊరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కొడుపాక శివారులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటింబికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బేగరి ప్రేమయ్య( 45) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొన్ని నెలలుగా మద్యానికి బానిస కావడం తో తరచు భార్య, భర్తల మధ్య గొడవలు చోటు చేసుకుంటూ ఉండేవి. శనివారం రాత్రి ప్రేమయ్య అతిగా మద్యం సేవించి ఇంటికి వెళ్లడం తో భార్య భర్తల మధ్య గొడవ కావడం తో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తూ ఇంటి నుండి పోతుండడం తో కూతుళ్ళు పట్టుకొని వచ్చి కూర్చోపెట్టగా బహిర్ భూమికి వెలుతానని చెప్పి బయటకు వెళ్ళి వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్న చెట్టుకు ఊరి వేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. ఎంతకు భర్త రాలేదని గమనించిన భార్య పిల్లలు వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లగా ఊరి వేసుకున్న తండ్రిని గమనించిన కుటింబికులు స్థానికుల సహాయం తో చెట్టు నుండి దింపి చూడగా ఊపిరి ఉండడం తో ఆటోలో మెదక్ ఆసుపత్రికి తరలించగా పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించడం తో వెంటనే పాపన్న పేట పోలీసులకు సమాచారం అందివ్వడం తో పాపన్న పేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ మృతుడి కుటింబికుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా మృతుడికి భార్య సునీత,ముగ్గురు కూతుళ్ళు ఉన్నారు.

# రాష్ట్రస్థాయి విజేతకు నగదు బహుమతి



పాపన్నపేట, ప్రతినిధి మే 17:(తెలంగాణ పత్రిక)

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలో ప్రథమ స్థానం దక్కించుకున్నందుకు గాను పాపన్నపేట కు చెందిన విద్యార్థికి జేసి నగేష్, డిఇఓ రాజు చేతులమీదుగా నగదు బహుమతి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి గత మూడు నెలల క్రితం పటాన్చెరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 14 బాయ్స్ కబడ్డీ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన పాపనపేట విద్యార్థి సంకు నర్సింలుకు జెసి నగేష్, డిఇఓ రాజు చేతుల మీదుగా పదివేల రూపాయల నగదు బహుమతి, ప్రశంస పత్రం అందజేశారు. విద్యా వారోత్సవాల ముగింపు సందర్భంగా వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిడి రమేష్, తెలుగు ఉపాధ్యాయులు అంజగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన ఈ విష్ణు ను సన్మానించిన జిల్లా కలెక్టర్ అశ్విని తానాజీ

**-చల్లూరు హైస్కూల్లో 30 మంది విద్యార్థులు 500 పైగా మార్కులతో విజయకేతనం..**



వీణవంక ప్రతినిధి, మే 17( తెలంగాణ పత్రిక).

కరీంనగర్ జిల్లా స్థాయిలో జరిగిన విద్యా వారోత్సవాల విజయోత్సవ సభలో 10వ తరగతిలో జిల్లా స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన జడ్.పి.హెచ్.ఎస్ చల్లూరు పాఠశాలకు చెందిన ఈ . విష్ణు ను అడిషనల్ కలెక్టర్ విద్యాధికారిణి అశ్విని తానాజి, కరీంనగర్ మేయర్ సునీల్ రావు ఇతర అధికారులు సత్కరించి పదివేల రూపాయల నగదు బహుమతిని అందించడం జరిగింది. విద్యార్థి జిల్లాలో ప్రథమస్థానంలోనిలవడంతోపాటు 30 మంది పైగా విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించి 100 ఫలితాలతో జడ్.పి.హెచ్.ఎస్ చల్లూరు పాఠశాల మంచి ఫలితాలు సాధించడం పై అధికారులు తల్లిదండ్రులు గ్రామస్తులు ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

## వ్యవసాయ శాఖ పథకాల కొరకు రైతు గుర్తింపు కార్డ్ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలి

**-ఏవో భాస్కర్**

ఓదెల/తెలంగాణ పత్రిక (మే 17)



వ్యవసాయ శాఖ పథకాల కొరకు రైతు గుర్తింపు కార్డు ఫార్మర్ రిజిస్ట్ర నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్ అన్నారు ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మండల రైతులు తప్పకుండా వ్యవసాయ విస్తీర్ణ అధికారులు లేదా అందుబాటులోని మీ సేవ కేంద్రాల్లో రైతు గుర్తింపు కార్డ్ ( ఫార్మర్ రిజిస్ట్రీ) కొరకు నమోదు చేసుకోవాలని , రైతు సోదరులు ప్రభుత్వ పథకాలు పొందాలంటే తప్పకుండా రైతు గుర్తింపు కార్డ్ .ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలి అని అన్నారు. సంబంధిత రైతు వేదికల్లో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు లేదా అందుబాటు లో ఉన్న మీ సేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న రైతులు సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారి కి ఫోన్ కాల్ ద్వారా ఓటిపి చెప్పిన కూడా నమోదు చేసుకోవచ్చు అని తెలిపారు. నమోదు చేసుకొని రైతులకు ప్రభుత్వ పథకాలు అందటం లో ఇబ్బందులు వస్తాయి అని తెలిపారు. గడువు తేదీ ముగుస్తుంది కాబట్టి రైతులు వెంటనే నమోదు చేసుకోవాలి అని కోరారు. రెవెన్యూ గ్రామాల వారిగా ఇంకా నమోదు చేసుకొని రైతుల సంఖ్య. గూడెం 60 మంది గుంపుల 94 ఇందుర్తి 40 కనగర్తి 409 కొలానూర్. 510 కొమిర 182 మడక 201. నాంసానిపల్లి.172. ఓదెల 524 పోత్కపల్లి263 చానకొండ 176. నమోదు చేసుకోలేదని మీరందరూ తప్పకుండా ఇచ్చిన గడువు లోపల నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్ కోరారు.

## మాదిగ జాతి హక్కుల సాధనకు ఎమ్మార్పీఎస్ ఉద్యమం బలోపేతం చేయాలి

**-ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహణ**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మే 17, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి:)



ఎమ్మార్పీఎస్ -- ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిల్లా ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో మాదిగ జాతి హక్కుల సాధన, సామాజిక న్యాయం, ఉద్యమ బలోపేతంపై నాయకులు చర్చించారు.ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆశయాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లి ఉద్యమాన్ని మరింత బలపర్చాలని నాయకులు పిలుపునిచ్చారు. మాదిగల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ దాసరి శ్రీనివాస్, కొత్తపల్లి సోమయ్య, దాసరి సారథి తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలను మరింత విస్తరించి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగించాలని సమావేశంలో తీర్మానించారు.

# వీణవంక బస్టాండ్ సాక్షిగా ప్రమాదంగా మారిన రోడ్డు

**-వందలాది ఇసుక లారీలు రాకపోకలతో రోడ్లు ధ్వంసం..**

వీణవంక ప్రతినిధి, మే 17( తెలంగాణ పత్రిక).

వీణవంక మండల కేంద్రంలోని బస్టాండ్ వెనుక రోడ్డు మార్గం ఇసుక లారీల రాకపోకలతో, రోడ్డు ధ్వంసమై , లోయను తలపిస్తూ ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది లారీలు బస్టాండ్ వెనుక వైపు నుండి అధిక వ్యయంతో రాకపోకలు కొనసాగించడంతో రోడ్డు ఏటవాలుగా ఉండడంతో, రోడ్డు ఒక్కసారిగా కృంగి లోయగా మారి, రాత్రి సమయాల్లో గుంతను గమనించగా,బైకులు, కార్లు ప్రమాదాల బారిన పడుతూ, అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ప్రమాదాల బారిన పడిన సంఘట నలుగా కోకోలలుగా ఉన్న, ఆర్ అండ్ బి అధికారులు రోడ్ల భద్రతను మరిచి, ఆఫీసులకు పరిమితం అవుతున్నారని, ఇటీవలే రోడ్లలో ప్యాచ్ వర్క్ జరిగేటప్పుడు, కరీంనగర్- జమ్మికుంటను కలిపే ప్రధాన రహదారి కాస్త ఎత్తు పెరగడంతో రోడ్డు కాస్త ఏటవాలుగా ఉందని, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు చెప్పిన కూడా కాంట్రాక్టర్ వినకపోవడం వల్లే రోడ్డు ఈ విధంగా తయారైందని, రోడ్డు ఏటవాలుగా ఉండటం వల్ల అధిక వ్యయంతో వచ్చే వాహనాలు ఒకేసారి బ్రేక్ కొట్టడం వల్ల రోడ్డు ధ్వంసమై, గుంతలాగా మారి, పలు ప్రమాదాలకు నెలవయ్యిందని, వాటర్ ట్యాంక్ ఎదురుగా కరీంనగర్- జమ్మికుంట రోడ్డు మార్గంలో మిషన్ భగీరథ లో భాగంగా పైప్లైన్ వెయ్యడం కోసం



రోడ్డు కొంత ధ్వంసం కాగా, ప్యాచ్ వర్క్ సమయంలో మెటల్ వేయకపోవడం ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యానికి, కాంట్రాక్టర్ గొప్పతనానికి నిదర్శనంగా కనబడుతుంది. రోడ్డుకు అడ్డంగా తవ్వడంతో ప్రతిరోజు కిరాణా షాప్ నుంచి బైకులపై తీసుకువెళ్లే ఏదో ఒక వస్తువు గుంత ఉండడంతో, సడన్ బ్రేక్ వెయ్యడం వల్ల, బైక్ పై కవర్లో తీసుకువెళ్లే పదార్థాలైన చక్కెర, రవ్వ, కూరగాయలు,వాటర్ బాటిల్, కూల్ డ్రింక్స్, పాలు,పెరుగు ప్యాకెట్లు తదితర ఆహార పదార్థాలు జారిపోయి నేలపాలవడం ప్రయాణికులను , వాహనదారులను తీవ్ర అసహనానికి గురిచేస్తుంది. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు మేల్కొని, తక్షణమే బస్టాండ్ వెనకాల ఉన్న రోడ్డు మార్గాన్ని మరమ్మత్తులు చేపట్టి, ట్యాంక్ ఎదురుగా ఉన్న గుంతను పూడ్చి ప్రయాణికుల పసందైన ప్రయాణానికి నాంది పలకాలని, సురక్షిత గమ్యం చేరెందుకు సహకరించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

# ఆరుగాల కష్టం.. లారీల జాప్యం

**-ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్న బస్తాలు**

**-అధికారుల నిర్లక్ష్యంపై రోడ్డెక్కిన రైతన్నలు**

మంగపేట, మే17(తెలంగాణ పత్రిక)

ఆరుగాలం కష్టపడి, చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను పొత్తిళ్లలో బిడ్డలా కాపాడుకుంటున్నారు రైతులు. తీరా ఆ పంట చేతికొచ్చాక దాన్ని అమ్ముకుందామంటే సవాలక్ష నిబంధనలు, సమస్యలు రైతన్నలను వెంటాడు తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ములుగు జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ.. క్షేత్రస్థాయిలో లారీల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది.

**-పేరుకుపోతున్న ధాన్యం బస్తాలు:**

మంగపేట మండలం బోరు నరసాపురం గ్రామ పరిధిలోని ఐకేపీ, వివిధ సొసైటీల కొనుగోలు కేంద్రాలకు రెండు, మూడు రోజులకు ఒకసారి మాత్రమే లారీలను పంపిస్తున్నారు. దీంతో తూకం వేసిన ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాల్లోనే టన్నుల కొద్దీ పేరుకుపోతున్నాయి. ధాన్యం సేకరణలో ఎదురవుతున్న ఈ లారీల జాప్యం సమస్యను పరిష్కరించాలని రైతన్నలు ఎన్నిసార్లు కోరినా



అధికారులు పట్టించుకోకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**-రెండు గంటల పాటు రాస్తారోకో:**

అధికారుల తీరుతో విసిగిపోయిన రైతులు శనివారం రోడ్డెక్కారు. కమలాపురం పరిధిలోని ములుగు తాలూకా లారీ ఆఫీస్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. లారీలను వెంటనే ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో సుమారు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

**-పోలీసుల చొరవతో సర్దుమణిగిన ఆందోళన:**

రైతుల రాస్తారోకో సమాచారం అందుకున్న పోలీసు యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగింది. ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడి వారికి నచ్చజెప్పారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, లారీల కొరతను తీర్చి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పోలీసుల హామీతో రైతులు తమ ఆందోళనను విరమించి ఊపిరి పీల్చుకున్నారు.

# పేదల సేవలో జన్మదిన వేడుకలు

**-రవికుమార్ యాదవ్ జన్మదినోత్సవం సందర్భంగా ఉచిత ఆరోగ్య శిబిరం**

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మే 17,(తెలంగాణ పత్రిక)

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి కంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ రవికుమార్ యాదవ్, జన్మదినో త్సవాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు రాజు శెట్టి కురుమ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి డివిజన్ రాజీవ్ గృహకల్ప సెంటర్లో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరానికి స్థానిక పేద ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సేవలను వినియోగి ంచుకున్నారు. మొత్తం 121 మంది ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోడులు పంపిణీ చేయగా, మరో 201 మంది ప్రజలకు వారి ఆరోగ్య సమస్యలకు అనుగుణంగా ఉచిత మందులు అందజేశారు. వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు కూడా అందించారు. ఈ సందర్భంగా రాజు శెట్టి కురుమ






మాట్లాడుతూ, జన్మదిన వేడుకలను కేవలం ఆర్భాటాలకు పరిమితం చేయకుండా పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్వహించడం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా నాయకుల పట్ల ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని అన్నారు. శ్రీ రవికుమార్ యాదవ్, జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానికంగా విశేష స్పందన పొందింది. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమ ంలో సీనియర్ నాయకులు నరసింహ, సూర్ణ శ్రీశైలం, కౌసల్య, ఈరు సిద్దు, ఈ యెల్లేష్, నిలకంఠం రెడ్డి, మల్లేశం, కళ్యాణ్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సేవా కార్యక్రమాల ద్వారా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు..

# షార్ట్ సర్క్యూట్ తో పశుగ్రాసం దగ్ధం

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 17

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామంలో లూజు లైన్ల కారణంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి 20 వేల రూపాయలు విలువచేసే పశుగ్రాసం దగ్ధమైంది ఇప్పటికైనా అధికారులు ఇట్టి లూజు లైన్లను సరిచేసి డ్యామేజ్ పోల్స్ తీసివేసి కొత్త వాటిని వేసి ఇట్టి ప్రమాదం నుండి నివారించ వలసిందిగా రైతులు కోరుతున్నారు అదేవిధంగా పంటను దున్నే సమయంలో వ్యవసాయ పనులు చేసుకునే సమయంలో లూస్ లైన్లతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ భయంతో రైతులు భయపడుతూ పని చేసుకోవాల్సిన పరిస్థితి ఇప్పటికైనా లూజ్ లైన్లను సవరించి కొత్తవారిని వెయ్యాలని రైతులు కోరుతున్నారు



# ముగ్గురు విద్యార్థులకు నగదు పురస్కారం

**-రూ.10వేల చొప్పున అందించిన జిల్లా కలెక్టర్**

నంగునూరు, మే 17(తెలంగాణ పత్రిక):

పదో తరగతి ఫలితాల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాటు, క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు వెళ్లిన విద్యార్థులకు నగదు పురస్కారాలు లభించాయి. ఈ మేరకు సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.19వేల చొప్పున నగదు పురస్కారాలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా విద్యా విజయోత్సవం కార్యక్రమం నిర్వహించింది. సిద్ధిపేట జిల్లా విద్యాధికారి ఎల్లెంకి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సిద్దిపేటలోని ఇందిరానగర్ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యా విజయోత్సవ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటీవల విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విభాగంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించిన నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బొమ్మిడి అమూల్యా రెడ్డి, రెండో ర్యాంకు సాధించిన రాజగోపాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి.సహస్ర భారతి, విభాగంలో సాఫ్ట్ బాల్ పోటీలలో జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గట్ల మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హరిణి ప్రియ జిల్లా కలెక్టర్ హైమావతి, జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డిలు ఒక్కొకరికి రూ.పది వేల నగదుతో పాటు ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.హైమావతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని పదో తరగతి ఫలితాలు రుజువు చేశాయని చెప్పారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో పాల్గొనే అవకాశం కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే ఉంటుందన్నారు. జిల్లా విద్యాధికారి ఎల్లెంకి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వికాసానికి దోహదం చేసే ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు పిలుపు ఇచ్చారు. ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి ఆర్థికంగా నష్టపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు పయ్యావుల రామస్వామి, ముంద్రాతి రమేశ్, మండల విద్యాధికారి రాజ ప్రభాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు తొంట కనకయ్య, మాదాసి రమేశ్, ఆకుల సత్యనారాయణ, ఉపాధ్యాయులు దర్శనాల రాజ్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు



# ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి

**-నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవులపల్లి యాదగిరి**

నంగునూరు, మే 17(తెలంగాణ పత్రిక):

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవులపల్లి యాదగిరి సూచించారు. నంగునూరు మండలంలోని ఖాత, గట్లమల్యాల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. రైతుల కొనుగోలు వివరాల పట్టికలు, పుస్తకాలను పరిశీలించి ధాన్యం వివరాల నమోదు సక్రమంగా నమోదు చేయాలని నిర్వాహకులను కోరారు. రైతుల పేర్లు, బస్తాల వివరాలు తప్పిపోకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్లర్లు ఇబ్బందులు పెడుతున్నారని స్థానిక నాయకులు, రైతులు యాదగిరి దృష్టికి తీసుకు వచ్చారు. జిల్లా ఇంచార్జి మంత్రి డాక్టర్ వివేక్ వెంకట స్వామి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు ఇబ్బందులు లేకుండా మిల్లులకు వచ్చిన వెంటనే ధాన్యాన్ని ఖాళీ చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని రైస్ మిల్లర్లకు సూచించారు. రైస్ మిల్లర్లు ఉద్దేశ్య పూర్వకంగా రైతులను ఇబ్బందిలు పెడితే మంత్రి దృష్టికి తీసుకెళ్లి క్రిమినల్ కేసులు నమోదు చేసి లైసెన్లు రద్దు చేసి, మిల్లులను సీజ్ వేసేందుకు చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు అధైర్య పడవద్దని పండించిన ప్రతి చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. అధికారులు ఎప్పటికపుడు కొనుగోలు ప్రక్రియను పరిశీలించాలని సూచించారు. ఖాత సర్పంచ్ పుల్లూరు సోనీ మహేశ్, డైరెక్టర్ గాండ్ల రమేశ్, నాయకులు బాగు శ్రీకాంత్ యాదవ్, తుపాకుల శ్రీనివాస్, చల్లా శ్రీనివాస్ రెడ్డి, ఆరెపల్లి సురేశ్, పంగ రాజశేఖర్ రెడ్డి, మహాదేవ్, ఇజాజోద్దీన్ తదితరులు ఉన్నారు.



# ప్రపంచ తెలుగు 7వ మహాసభలకు అభ్యుదయ కవి తూముల శ్రీనివాస్‌కు ఆహ్వానం

కొత్తగూడెం,ఆర్ సి మే 17:(తెలంగాణ పత్రిక)

కళ కళ కోసం కాదని, సామాజిక ప్రజా చైతన్యం కోసం అనే సిద్ధాంతంతో ప్రజల మధ్య నిరంతరం ఉంటూ ప్రజా ఉద్యమాలలో తన కలం, గళంతో చైతన్య బావుటా ఎగరవేస్తున్న అభ్యుదయ కవి తూముల శ్రీనివాస్ కు 7వ ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం అందింది. ప్రజానాట్య మండలి కళాకారుడిగా ప్రజా సమస్యలపై చైతన్యం కలిగించే నాటికల్లో నటుడిగా విశేష ప్రజాదరణ పొందిన ఆయన, వంగపండు ప్రసాదరావు రచించిన "భూమి బాగోతం", 'రాజకీయ బాగోతం" వంటి నృత్యనాటికలను వందకు పైగా ప్రదర్శించారు. అలాగే "కదలిరండి", "మా భూమి దొంగలు ఎత్తుకెళ్లారు", "దున్నేవాడిదే భూమి", "మేము మనుషులమే", "కనువిప్పు", "శాంతి కోసం క్రాంతి" వంటి సామాజిక చైతన్య నాటికల్లో నటించి ప్రజా మన్ననలు పొందారు. అభ్యుదయ కవిగా వందలాది గీతాలు, కవితలు రచించిన తూముల శ్రీనివాస్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దళిత సాహిత్య అకాడమీ జాతీయ పురస్కారంతో పాటు "కవి మిత్ర", "కవిరత్న", "ఉద్యమ కవి" వంటి అనేక పురస్కారాలు అందుకున్నారు. నటుడిగా, గాయకుడిగా, టెలిఫిలిం ఆర్టిస్టుగా, ఆల్ ఇండియా రేడియో గాయకుడిగా కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. చైతన్య సారస్వత పరిషత్ సౌజన్యంతో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సాహితీ సాంస్కృతిక సామాజిక సేవ సమాఖ్య ఆధ్వర్యంలో జూన్ 6, 7 తేదీలలో రాజమహేంద్రవరం లోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ లో అత్యంత వైభవంగా నిర్వహించనున్న 7వ ప్రపంచ తెలుగు మహాసభలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన అరసం కవి తూముల శ్రీనివాస్‌కు ప్రత్యేక ఆహ్వానం అందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సాహిత్య వేదికలో సామాజిక చైతన్య కవితా గీతాన్ని తూముల శ్రీనివాస్ ఆలపించనున్నారు. ఈ అరుదైన ఆహ్వానం లభించడంపై ఆయన మిత్రులు, శ్రేయోభిలాషులు, సాహితీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



# బొప్పని రవికుమార్ -దివ్యావాణి లను ఆశీర్వదించిన మంత్రి వివేక్

**-ప్రభుత్వ చీఫ్ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్**

మాడ్గులపల్లి//నల్గొండ//మే 17:(తెలంగాణ పత్రిక):-

మండలంలోని తోపుచర్ల గ్రామానికి చెందిన మాల మహానాడు నల్లగొండ జిల్లా అధ్యక్షులు బొప్పని నగేష్ సోదరుడు బొప్పని రవికుమార్ వివాహం మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన సొంత అక్క సామ పద్మ కూతురు దివ్యావాణి తో ఇటీవల అంగరంగ వైభవంగా జరిపించిన విషయం విదితమే. వీరివివాహ సమయంలో అత్యవసర అధికారిక కార్యక్రమాలు, నిరంతర ప్రభుత్వ బిజీ షెడ్యూల్ ఉన్న కారణంగా రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పనశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరు కాలేక పోయారు. ఈ నేపథ్యంలో బొప్పని నగేష్ కు ఇచ్చిన మాట ప్రకారం నవ వధూవరులైన బొప్పని రవి కుమార్ -దివ్యావాణి లను ఆశీర్వదించడాని కి ఆదివారం మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రత్యేకంగా మిర్యాలగూడ నియోజకవర్గం మాడ్గులపల్లి మండలం తోపుచర్ల గ్రామంలోని నగేష్ గృహానికి విచ్చేసిన మంత్రి గడ్డం వివేక్, వెంకటస్వామి నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీ ర్వదించారు. తోపుచర్ల గ్రామానికి మంత్రి వివేక్ వెంకటస్వామి వస్తున్నారనే సమాచారం మేరకు నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, దళిత, అంబేద్కర్ సంఘాలనాయకులు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వివేక్ వెంకటస్వామి అభిమానులు పెద్ద సంఖ్యలోతరలివచ్చి మంత్రి వివేక్ కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్ తో పాటు ప్రభుత్వ చీఫ్ విప్ వేముల వీరేశం,మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ లు పాల్గొని నూతన వధూవరులు బొప్పని రవికుమార్- ప్రభుత్వ ఉపాధ్యాయురాలు దివ్యా వాణి లకు శాలువా కప్పి సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపి వీరి వైవాహిక జీవితం నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో అన్యోన్యంగా కొనసాగాలని ఆశీర్వదించి, అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ముండ్లగిరి కాంతయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ రాజు, ప్రముఖ అంబేద్కరిస్టులు డా. జాడీ రాజు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు వల్లపుదాస్ సతీష్ కుమార్, ఎకుల రాజారావు, మాల మహానాడు జిల్లా నాయకులు యేకుల సురేష్, మేడ సైదులు, తోపుచర్ల మాజీ సర్పంచ్ మంగ యాదగిరి, ఉపసర్పంచ్ వల్లెపు నరేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు గౌని నిరంజన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డా. శ్రీనివాస్ రెడ్డి, షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు మాడుగుల శ్రీనివాస్, చింతమళ్ళ ఆనంద్ కుమార్, అభినవ్, మీసాల నాగేందర్, రెడ్డిమల్ల రవి, కట్టా శ్రీనివాస్ రెడ్డి, పాస్టర్ వేముల రాము,షేక్ ఖాలీల్ పాషా, మంగ అంజి, బొప్పని లక్ష్మయ్య, బొజ్జ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## వేసవిలో పిల్లలు ఈత నేర్చుకోవడానికి మానేరులో కొలను తవ్వించిన సర్పంచ్ కొలిపాక రజిత - శ్రీనివాస్

**-సంతోషం వ్యక్తం చేసిన చుట్టుపక్క గ్రామాల ప్రజలు..**



వీణవంక ప్రతినిది, మే 17( తెలంగాణ పత్రిక).

వీణవంక మండలం మల్లారెడ్డి పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కొలిపాక రజిత -శ్రీనివాస్ వేసవికాలం దృష్ట్యా చిన్నపిల్లలు ఈత నేర్చుకోవడం కొరకు జెసిబితో నీరు ఆగేందుకు వీలుగా కొంత లోతుతో కొలను తవ్వించారు. వేసవికాలం దృష్టిలో పెట్టుకొని మానేరు తీరంలో చిన్న పిల్లలు ఈత నేర్చుకోవడానికి అలాగే పెద్దలు కూడా స్నానాలు చేయడానికి మానేరులో జెసిబి తో తవ్వించడం జరిగింది.ఇది తీసినప్పటి నుండి చుట్టుపక్కల గ్రామాలైనా చల్లూర్, దేశాయిపల్లి,కనగర్తి ఇతర గ్రామాలకు సంబంధించిన ప్రజలు వేసవికాలం కావడంతో వాళ్ల పిల్లల్ని తీసుకువచ్చి ఈత నేర్పియడం జరుగుతుంది.ఇది ఉదయం 6 గంటల నుండి మొదలై, సాయంత్రం 6 వరకు ఈ ప్రాంతమంతా వంద మంది చిన్న పిల్లలతో వారి తల్లిదండ్రులతోకిటకిటలాడుతుంది. అలాగే ఇక్కడికి వచ్చే ప్రజలు కూడా చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.మండుటెండర్లో సైతం చల్లగా సేద తీరడానికి కూడా వాగులోకి రావడం జరుగుతుంది. మానేరు నది పుణ్య స్నానా లు ఆచరించడం జరుగుతుంది.మానేరు లో పిల్లల్ని ఆనందానికి అవధులు లేవని, గ్రామ సర్పంచ్ సంతోషం వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోలిపాక రజిత- శ్రీనివాస్, ఉపసర్పంచ్ అర్సం శ్రీనివాస్, వార్డ్ మెంబర్ కర్రె నాని, గ్రామ ప్రజలు నరేష్, పెద్దులు సాయి, రమేష్, గోపి పాల్గొన్నారు.

## మండల టాపర్ కు 10,000 నగదు

పాపన్నపేట, ప్రతినిధి మే 17 :(తెలంగాణ పత్రిక)



ఇటీవల నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో మండల్ టాపర్ గా నిలిచిన చీకోడ్ లింగయ్యపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్ రెడ్డికి 10,000 నగదు జెసి నగేష్, డీఈఓ రాజు చేతుల మీదుగా బహుకరించారు. మెదక్ లో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ నగదు అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి వెల్లడించారు.

# నేడు 2కే రన్

తానూర్:17మే(తెలంగాణ పత్రిక)



యువజన క్రీడల వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 7 గంటలకు తానూర్ బస్టాండ్ నుంచి హిప్పెల్లి వరకు 2కే రన్ కార్యక్రమం ఉంటుందని ఎంఈవో నరేందర్ ఒక ప్రకటన తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు, నాయకులు గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## త్వరితగతిన ధాన్యం తరలించాలి

**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 17, తెలంగాణ పత్రిక

కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు ఆదివారం పరిశీలించి.. అధికా రులకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయాలని, మిల్లులకు తరలించాలని సూచిం చారు. మిల్లర్లు హమాలీల సంఖ్య ను పెంచి వెంట వెంటనే ధాన్యం అన్ లోడింగ్ చేయాలని ఆదేశించారు. లారీల ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాల సంఖ్య పెంచాలని, ధాన్యానికి అనుగుణంగా సమకూర్చాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. టార్పాలిన్లు అందుబాటులో పెట్టాలని సూచించారు. ధాన్యం తడవకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.





**-అన్ లోడింగ్ లో వేగం పెంచాలి**

ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ లోని ఏఎంసీ గోదాములో ధాన్యం అన్ లోడింగ్ చేస్తుండగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఏ ఏ మండలాల నుంచి ధాన్యం వస్తుందో ఆరా తీశారు. హమాలీల సంఖ్యను పెంచి.. వెంట వెంటనే ధాన్యం అన్ లోడింగ్ చేయించాలని ఆదేశించారు.తనిఖీలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, తహసీల్దార్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు రేంజ్ పరిధిలోని ముసలమ్మ గుడి అడవుల్లో దారుణం



కొత్తగూడ మండల ప్రతినిధి మే 17. (తెలంగాణ పత్రిక)

మహబూబాబాద్ జిల్లా గూడూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కొత్తగూడ మండలం, గుంజేడు ముసలమ్మ దేవస్థాన పరిసర అడవుల్లో వేటగాళ్ల ఆగడాలు మితిమీరి పోతున్నాయి. అడవి జంతువుల వేట కోసం కొందరు కిరాతకులు అమర్చిన విద్యుత్ ఉచ్చు (లైవ్ కరెంట్ వైర్లు) ఒక పాడి జంతువు ప్రాణాలను బలితీసుకుంది. స్థానిక రైతు బిజ్జ వెంకన్నకు చెందిన బర్రె (గేదె) మేతకై అడవిలోకి వెళ్లి, ఈ విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందింది. తమ అమర్చిన కరెంట్ తీగలకు బర్రె బలికావడంతో, ఎక్కడ విషయం బయట పడుతుందోనని భయపడిన వేటగాళ్లు దారుణానికి ఒడిగట్టారు. చనిపోయిన బర్రె కళేబరాన్ని గుట్టుచప్పుడు కాకుండా సమీపంలోని పొదల్లో దాచిపెట్టి అక్కడి నుంచి పరారయ్యారు. తునికాకు కూలీల అప్రమత్తత.. తృటిలో తప్పిన ముప్పు! ప్రస్తుతం తునికాకు సేకరణ సీజన్ కావడంతో, స్థానిక కూలీలు ప్రతిరోజూ తెల్లవారుజామునే ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని అడవి బాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం ఆకు సేకరణ కోసం అడవిలోకి వెళ్లిన కూలీలకు పొదల్లో దాచి ఉంచిన బర్రె కళేబరం కనిపించడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. కాస్త ముందుకు వెళ్లి పరిశీలించగా, అక్కడ వేటగాళ్లు అమర్చిన లైవ్ కరెంట్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతూ కనిపించాయి. గూడూరు రేంజ్ అధికారుల నిఘా కరవు? ?గూడూరు రేంజ్ పరిధిలోని అడవుల్లో వన్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతున్నా అటవీ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అడవుల్లో కరెంట్ తీగలు అమర్చుతుంటే సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు ఏం చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా గూడూరు రేంజ్ ఉన్నతాధికారులు స్పందించి, అడవుల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని, విద్యుత్ ఉచ్చులు వేసి మూగజీవాల మృతికి, కూలీల ప్రాణసంకటానికి కారణమవుతున్న వేటగాళ్లను కఠినంగా శిక్షించాలని బాధితుడు వెంకన్నతో పాటు స్థానిక ప్రజలు, కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

## సింగరేణి విశ్రాంతి ఉద్యోగి మందు తాగి మృతి

17 ఓదెల తెలంగాణ పత్రిక



ఓదెల మండలంలోని నాంసానిపల్లి గ్రామానికి చెందిన రాసపల్లి రాజయ్య వయసు 76 సంవత్సరాలు సింగరేణి విశ్రాంతి ఉద్యోగి ముగ్గురు బిడ్డలకు వివాహాలు జరిగాయి ఒక కొడుకు కూడా వివాహం జరిగి గోదావరిఖనిలో ఉంటున్నాడు సొంత గ్రామంలో తన భార్యతో పాటు రాసపల్లి రాజయ్య. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు విపరీతంగా మందుకు బానిసై భార్య మందలించడంతో శనివారం ఉదయం 10 గంటలకు తన ఇంటిలో గడ్డి మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తెల్లగా చికిత్స అనంతరం ఎదిగిన వైద్యం గురించి కరీంనగర్లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు చికిత్స పొందుతూ రాత్రి 11 గంటలకు చనిపోయాడని మృతుడి భార్య రాసపల్లి రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుపోత్కపల్లి ఎస్సై దికొండ రమేష్ తెలిపారు.

## యువజన, క్రీడా వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 17, తెలంగాణ పత్రిక

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 డేస్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఈ నెల 18 వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాల పోస్టర్లను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు.ఇందులో భాగంగా 18వ తేదీన సోమవారం జిల్లాస్థాయిలో ఉదయం ఏడు గంటలకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు 2కే రన్ ప్రోగ్రాం జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఏ రాందాసు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.వివిధ పాఠశాలల, కళాశాలల బాల బాలికలు, యువత, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ కోచ్ లు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, క్రీడా అసోసియేషన్ సభ్యులు, ప్రెసిడెంట్లు తరలివచ్చి విజయవంతం చేయాలని రాందాస్ కోరారు. అలాగే ఈ నెల 23వ తేదీన సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్ లో నిర్వహించనున్న జాబ్ మేళా పోస్టర్లు ఆవిష్కరించారు.

# విద్యాభివృద్ధిపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ





**-ప్రభుత్వ స్కూళ్ళలో మెరుగైన వసతులు**
**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**-ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమం**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 17, తెలంగాణ పత్రిక

విద్యాభివృద్ధిపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టి ముందుకుసాగుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 11 వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు విద్యాశాఖ విజయోత్సవం ముగింపు సందర్భంగా జిల్లా సమీకృత కార్యాల యాల సముదాయంలో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జయ జయహే తెలంగాణ పాటను వినిపించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పదో తరగతి, ఇంటర్లో ఉత్తమ ప్రతిభ చూపిన. వివిధ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ లో రాణించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు అందజేసి.. అభినందించారు. పదో తరగతి, ఇంటర్ లో మొత్తం 11 మంది విద్యార్థులు మంచి మార్కులు సాధించగా, లక్ష రూపాయలు ప్రోత్సాహం కింద అందజేశారు.బడికి తక్కువ సెలవులు తీసుకుని హాజరు అయిన టీచర్లను సన్మానించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. సమ్మర్ క్యాంపులు ప్రారంభించామని, 100 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. ఇటీవల సర్పంచులకు కూడా విద్యా ప్రాధాన్యం పై వివరించారు. విద్యార్థుల తల్లితండ్రుల నమ్మకాన్ని పెంపొందించేలా .. కార్పొరేట్ కు దీటుగా బోధన, వసతులు ప్రభుత్వం దృష్టి పెడుతుందని తెలిపారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, కాస్మోటిక్, డైట్ చార్జీలు పెంచామని గుర్తు చేశారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ లో సన్మానిస్తున్నామని తెలిపారు. 10వేల టీచర్ పోస్టులు ప్రభుత్వం భర్తీ చేసిందని, బదిలీలు, ప్రమోషన్లు కల్పిస్తుందని వెల్లడించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, స్కిల్ యూనివర్సిటీ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు మంజూరు చేసి.. విద్యాభివృద్ధి, ప్రత్యేక అంశాల్లో విద్యార్థులు, యువతకు శిక్షణ ఇస్తుందని తెలిపారు.తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు రానున్నాయని వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆరుట్లలో డే స్కాలర్ విధానంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని, వందలాది మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఆయా స్కూళ్ళలో అడ్మిషన్లకు పోటీ పెరిగిందని గుర్తు చేశారు. ఆ స్కూల్లో పిల్లలకు టిఫిన్, భోజనం, ఈవెనింగ్ స్నాక్స్ ఇస్తూ.. బస్సుల్లో తరలిస్తున్నారని తెలిపారు. మంచి వాతావరణంలో స్కూల్స్ ఉన్నాయని, డ్రాప్ ఔట్లు ఉండవని వివరించారు. బడ్జెట్లో విద్య కోసం 15 శాతం ఇస్తామని సీఎం ప్రకటించారని గుర్తు చేశారు. అన్ని వర్గాల ప్రయోజనమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విజయవంతంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించామని పేర్కొన్నారు. వివిధ అంశాలపై సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. మూడేండ్ల వయసు, అలాగే ఆరేండ్లలోపు పిల్లలు తమ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో నమోదు కావాలని సూచించారు. కోడి గుడ్లు, బాలామృతం, ఇక్రిశాట్ వారి సూచనల మేరకు రూపొందించిన స్నాక్స్, పాలు పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన కల్పించామని గుర్తు చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను చూస్తే గర్వంగా ఉందని పేర్కొన్నారు. అన్ని సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని.. ఉత్తమ ఫలితాలు సాధించినందుకు అభినందనలు తెలియజేశారు. ప్రతి విద్యార్థి తాము ఎక్కడి నుంచి వచ్చినా పూర్తి స్థాయిలో తమ సామర్థ్యం వినియోగించుకున్న వారు మంచి స్థానాలకు ఎదుగుతారని తెలిపారు. ఏదైనా ఒక రంగంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థుల వివరాలతో ఫ్లెక్సీలు రూపొందించి .. విద్యా సంస్థల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ విద్యాలయాల్లో ఎంతో ప్రతిభ ఉన్న టీచర్లు, మంచి వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. విద్యా శాఖ వారోత్సవాల సందర్భంగా జిల్లాలో సైన్స్ ల్యాబ్ లు, అదనపు తరగతులు, ఇంకుడు గుంతలు ప్రారంభించామని, విద్యార్థులకు రెమెడీయల్ తరగతులు నిర్వహించామని, గ్రంథాలయ దినోత్సవం, సమ్మర్ క్యాంపులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఉపయోగపడ్డాయని, పిల్లలు ఎన్నో అంశాల్లో తమ ప్రతిభ చూపారని తెలిపారు. విద్యార్థులు దిన పత్రికలు, పుస్తకాలు చదవాలని సూచించారు. దీంతో విద్యార్థులకు అన్ని అంశాలపై అవగాహన వస్తుందని వివరించారు. ఈ అలవాటు భవిష్యత్తు జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.టైం టేబుల్ ప్రకారం ప్రతి పాఠ్యాంశం చదవాలని సూచించారు. సిలబస్ పూర్తి చేసి.. పరీక్షలకు ముందు మరోసారి చదవాలని పేర్కొన్నారు. గత ప్రశ్న పత్రాలకు జవాబులు రాయాలి.. చదవాలని సూచించారు. పిల్లలను తల్లితండ్రులు ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, వివిధ మండలాల ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు

## అధికారంలోకి వచ్చి మూడేళ్లు అయిన ఎన్నికల వాగ్దానాలను విస్మరించిన మంత్రి, ఎమ్మెల్యే

**-మూడేళ్లయిన ముందుకు సాగని తోపుచర్ల లిఫ్టుపనులు**
**-రైతులకు క్షమాపణ చెప్పాలి బిఆర్ఎస్ నేతల డిమాండ్**

మాడ్గులపల్లి//నల్గొండ//మే 17:(తెలంగాణ పత్రిక):-

అమలకు సాధ్యం కానీ అనేక హామీలను, అబద్ధపు ప్రచారం తో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో మూడేళ్లు గడిచిన మాడ్గులపల్లి మండలం తోపుచర్ల లిఫ్టు పనులు ముందుకు సాగడం లేదని భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు నిమ్మల నవీన్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఉమ్మడి తోపుచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు రైతులతో కలిసి 14ఎత్తిపోతల పథకం రెండవ బావి వద్ద అసంపూర్తిగా ఉన్న తోపుచర్ల లిఫ్టు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, మాజీ వైస్ ఎంపిపి జెర్రిపోతుల రాములు గౌడ్, తో కలిసి అయన మాట్లాడుతూ గత మూడున్నర ఎళ్ల క్రితం కెసిఆర్ నాయకత్వం లోని బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వరద కాలువ,డి- 40 కాలువల చివరి ఆయ కట్టు పరిధిలోని తోపుచర్ల, పుచ్చాకాయల గూడెం, గణపతివారి గూడెం, దేవత లబావి గూడెం, బొమ్మకల్లు, తదితర గ్రామాలలోని చెరువులు,కుంటలను నింపి కొత్తగా రెండు వేలఎకరాల భూములను స్థిరీకరించేందుకు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు కోరిక మేరకు తోపుచర్ల లిఫ్టును మంజూరు చేస్తూ నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. ఆ తర్వాత జరిగిన సాధారణ ఎన్నికలలో అమలకు సాధ్యం కానీ హామీలను ఇచ్చి అబద్ధపు ప్రచారంతో ప్రజలను మోసగించి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ తోపుచర్ల లిఫ్టు పనులు చేపట్టడంలో పూర్తి నిర్లక్ష్యం వహించడంతో లిఫ్టు పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాటి నల్లగొండ ఎంపి నేటి నీటి పారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తంకుమార్ రెడ్డి ప్రస్తుత మిర్యాలగూడ శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు తోపుచర్ల తో పాటు జిల్లాలోని అన్ని లిఫ్టులను పూర్తి చేసి చెరువులను నింపి రైతులకు సాగునీరందిస్తామని ఉత్తర ప్రగల్బాలు పలికారన్నారు. ఏడాదిలోపు లిఫ్ట్ పనులు పూర్తి యలేని పక్షంలో రైతులు తమ ను చెట్టుకు కట్టివేయాలని ప్రకటించడం జరిగిందన్నారు. ఎన్నికలు జరిగి మూడేళ్లు గడిచిన ఇప్పటి వరకు తోపుచర్ల లిఫ్టు పనులను పూర్తి చేయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, లను ఎప్పుడు ఎక్కడ ఏ చెట్టుకు కట్టివేయాలో వారిద్దరూ నిర్ణయించు కోవాలన్నారు. అధికారం కోసం కల్ల బొల్లి మాటలు చెప్పి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి మంత్రులు ఎమ్మెల్యే నాయకులు రైతుల పై ఏమాత్రం ప్రేమ ఉన్న తక్షణమే తోపుచర్ల లిఫ్టు పనులను ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులను సమీకరించి ఆందోళన చేపట్టి ప్రభుత్వం మెడలు వంచి లిఫ్ట్ పనులను ప్రారంభించి పూర్తి చేయిస్తామని హెచ్చరించారు. అదే విధంగా తోపుచర్ల ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలో గున్ రెడ్డి గూడెం నుండి మంగాపురం వరకు బిటి రోడ్డు నిర్మాణానికి, రూ. 6 కోట్లు,తోపుచర్ల నుంచి



మాడ్గులపల్లి రహదారి నిర్మాణానికి రూ. 3 కోట్లు పుచ్చకాయలగూడెం నుండి మండల కేంద్రానికి వెళ్లే రహదారి నిర్మాణానికి రూ. 1కోటి నిధులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంజూరు చేసినట్టు స్థానిక నాయకులు పత్రికలలో ప్రకటించి రెండేళ్లు గడిచిన ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణ పనులకు అతిగతి లేకాపోగా నిధుల మంజూరు జడ లేదని ఆయన ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వహయాం లో మంజూరై న నిధులతో చేపట్టిన పనులను మాత్రమే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ కాలయాపన చేయడం తప్ప మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క పైసా నిధులు తీసుకొచ్చిన పాపాన పోలేదని అయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీత్యాతండ, తోపుచర్ల గ్రామ పంచాయతీ సర్పంచులు రాయరాపు ఉమారాణి- వెంకన్న, నన్నెబోయిన పార్వతమ్మ - రమేష్, బిఆర్ఎస్ నాయకులు తంగేళ్ల సీతారాంరెడ్డి, గుర్రం వెంకట్ రెడ్డి, పోతురాజు యాదయ్య, మాడ్గుల చుక్కయ్య, నిమ్మల సీతారాంరెడ్డి, మంచికంటి అమృతరెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రషీద్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక కథనం ధాన్యం కొనుగోళ్లు వేగవంతం





**-జిల్లా అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయి పర్యటనలు, పర్యవేక్షణ్ణ**

**-ఇప్పటి దాకా 16,511 మంది రైతుల నుంచి 1,33,125 మెట్రిక్ టన్నుల సేకరణ**

**-దాదాపు 44 శాతం సేకరణ లక్ష్యం పూర్తి**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 17, తెలంగాణ పత్రిక

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుంది. ఇప్పటి దాకా 1,33,125 లక్షల మెట్రిక్ టన్నుల సేకరించగా, 44 శాతం పూర్తి అయింది. ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారి, కొనుగోలు కేంద్రాలకు, మిల్లులకు, గోడౌన్లకు ప్రత్యేక అధికారులను నియమించి.. కొనుగోళ్లు, తరలింపు, అన్ లోడింగ్ సాఫీగా ముందుకు సాగేలా పక్కా ప్రణాళిక ప్రకారం అధికార యంత్రాంగం ముందుకు సాగుతున్నది.రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఐకేపీ, ప్యాక్స్, మెప్మా, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 236 కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించడానికి, రైతులకు క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది.

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ క్రమం తప్పకుండా పరిశీలిస్తూ.. ప్రక్రియ సజావుగా సాగేలా చూస్తున్నారు. అధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలు అందిస్తున్నారు.సంబంధిత శాఖల జిల్లా అధికారులతో పాటు, జిల్లాలోని మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఇతర సిబ్బంది తమ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి, క్షేత్ర స్థాయిలో రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచనలు చేస్తూ, కొనుగోళ్ళ ప్రక్రియ వేగవంతం అయ్యేలా దృష్టి సారిస్తున్నారు. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నారు.

**-వాహనాలు అందుబాటులో ఉండేలా..**

రైతుల నుంచి తూకం వేసి సేకరించిన ధాన్యం మిల్లులకు తరలించేందుకు వాహనాలు అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ చేస్తున్నారు. ఈసారి ధాన్యం తరలింపులో లారీలు, వ్యాన్లు, ట్రాక్టర్లకు అనుమతి ఇచ్చి.. ధాన్యం తరలింపులో ఇబ్బందులు రాకుండా చూస్తున్నారు.

**-ధాన్యం నిల్వలో ఇబ్బందులు దూరం చేసేందుకు..**

ధాన్యం నిల్వలో ఇబ్బందులు దూరం చేసేందుకు జిల్లాలోని మార్కెట్ యార్డ్ గోదాములు, అపరల్ పార్క్ కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అక్కడ ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల కొరత లేకుండా చూస్తూ.. వారికి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం సౌకర్యాలు కల్పిస్తున్నది.

**-ఇప్పటికే 44 శాతం పూర్తి..**

జిల్లాలో ఈ సీజన్లో దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటిదాకా 16,511 మంది రైతుల నుంచి 1,33,125 మెట్రిక్ టన్నులు సేకరించారు. దాదాపు 44 శాతం సేకరణ లక్ష్యం పూర్తి అయింది. రైతులకు ఇబ్బందులు కలగకుండా రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేస్తున్నారు. ఇప్పటిదాకా రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.188 కోట్ల 37 లక్షలు జమ చేశారు.

# కోడిరెక్క శౌరి అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి





**-రైతులు పండించిన ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తుంది**

మిర్యాలగూడ ప్రతినిధి//మే 17:(తెలంగాణ ప్రతినిధి):-

మిర్యాలగూడ పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోడిరెక్క శౌరి అంత్యక్రియలో పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికీ మనోధైర్యం కల్పించరు. అనంతరం మంత్రి వివేక్ స్థానిక ఎమ్మెల్యే బిఎల్ఆర్ క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రితో పాటు సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లు పాల్గొన్నారు.

అనంతరం మంత్రి వివేక్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తుంది. ఇందిరమ్మ ఇల్లు సకాలంలో అందించి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నాం. లబ్ధిదారులకు పేమెంట్లు సకాలంలో అందజేస్తున్నాం. జూన్ 2నుండి కొత్త పెన్షన్లు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుంది. గత పది ఏళ్లలో బీఆర్ఎస్ హయాంలో ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదు. రెండు లక్షల కొత్త పెన్షన్లకు ఆమోదముద్ర వేసిన ప్రభుత్వం మిర్యాలగూడ, నకిరేకల్ లలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు..త్వరలో పనులు ప్రారంభం. దేశంలోనే టాశీ కామ్ కు 90 కోట్లు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డి టాశీ కామ్ లో నిరుద్యోగ యువతకు ఆధునిక టెక్నాలజీ పై నైపుణ్యం,ఉపాధి కల్పించడమే లక్ష్యం జర్మనీలో ఐదు లక్షల ఉపాధి అవకాశాలు ఉన్నాయి. అందుకే టాం కామ్ సంస్థ ద్వారా జర్మనీ భాషలో కూడా నైపుణ్యం సాధించేందుకు ప్రత్యేక ఫ్యాకల్టీని నియమిస్తున్నాం. పరిశ్రమలో కార్మికుల రక్షణ కోసం ఆయా ఫ్యాక్టరీలో చేసిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ముఖ్యంగా ఫార్మా రంగంలో ప్రమాదాల నివారణకు నూతన విధివిధానాల ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటాం.

# ఘనంగా కాషాయ దళపతి రవి కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు

**-బోయిని మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో.**

తెలంగాణ పత్రిక న్యూస్ ప్రతినిధి శేర్లింగంపల్లి మే 17.

హఫీజ్‌పేట్ డివిజన్ బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ శ్రీమతి బోయిని అనూష మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో, మసీద్‌బండ బీజేపీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ రవి కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పలు రాష్ట్రాల సంఘ నాయకులు, బీజేపీ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీ రవి కుమార్ యాదవ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపగా, నాయకులు పూలమాలలు వేసి ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, శ్రీ రవి కుమార్ యాదవ్ పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న అంకితభావం కలిగిన నాయకుడని కొనియాడారు. యువతకు ఆదర్శంగా నిలుస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బోయిని అనూష మహేష్ యాదవ్ మాట్లాడుతూ, బీజేపీ పార్టీ బలోపేతానికి శ్రీ రవి కుమార్ యాదవ్ సేవలు అమూల్యమని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలు రాష్ట్రాల సంఘ ప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళా నాయకులు, యువ మోర్చా నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.



# ఎండమూరి లేఔట్ నూతన అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటు

హైదరాబాద్ మే 17 తెలంగాణ పత్రిక :

మహదేవపురం డివిజన్ ఎండమూరి లేఔట్‌లో నూతన అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటైంది. అసోసియేషన్ అధ్యక్షుడిగా సుమన్ రెడ్డి, చైర్మన్‌గా వెంకట్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్‌గా మల్లేశం, కోశాధికారులుగా అకెళ్ళ శ్రీనివాస్, గోవింద్, వైస్ ప్రెసిడెంట్‌గా రవి సజన్ ఎన్నికయ్యారు. అదేవిధంగా సలహాదారులుగా శివానంద్ మాడపాటి, వీరబాబు, అంజి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చందు, రమేష్ రెడ్డి, కృష్ణ నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా భీమా రెడ్డి, రవి, శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, పెద్దలు, మాజీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన అసోసియేషన్ అధ్యక్షుడు మరియు జనరల్ సెక్రటరీ మాట్లాడుతూ, కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, స్ట్రీట్ లైట్ల సమస్యలను త్వరితగతిన ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



## ఆల్ ఇండియా ర్యాంకర్ శ్రీకాంత్ ను సన్మానించిన పట్లోరి రాజు



మెదక్ జిల్లా చిన్న శంకరంపేట (తెలంగాణ పత్రిక) మే 17

చిన్న శంకరంపేట్ మండలం గవ్వలపల్లి గ్రామాపంచాయతీ పరిధిలోని అగ్రహారం కి చెందిన కోరే కొమురయ్య సత్తెమ్మ కుమారుడు శ్రీకాంత్ ఏ ఐ ఐ ఎం ఎస్ లో ఆల్ ఇండియా 590 ర్యాంక్ సాధించిన సందర్భంగా వారికి శాలువాతో సన్మానించిన బిఆర్ఎస్ పార్టీ మండల అద్యక్షులు పట్లోరి రాజు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో పుట్టి ఆలిండియాలో గొప్ప ర్యాంకు సాధించిన శ్రీకాంత్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని మన గ్రామానికి మన మండలానికి మంచి పేరు తీసుకురావాలని వారికి శుభాభినందనలు తెలియజేశారు శ్రీకాంత్ ను ఆదర్శంగా తీసుకొని వారి బాటలోనే మండలానికి చెందిన అనేకమంది యువకులు కూడా ఇలాంటి ఉన్నతమైన విద్యలో రాణించారు తల్లితండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చే విధంగా చదువుకోవాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూపాల భూపాల సిద్ధి రాములు ఉప సర్పంచ్ సెనవత్ స్వామి ర్డు సభ్యులు శ్రీశైలం మహేష్ లచ్చలు శంకర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా టియూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు-షేక్ రసూల్



మాడుగులపల్లి//నల్గొండ//మే 17:(తెలంగాణ పత్రిక):-

జర్నలిస్టుల వృత్తి నిర్వహణ రోజురోజుకు సంక్లిష్టమవుతున్న దశలో అనేక ఆటుపోట్లను ఎదుర్కోవాల్సి వస్తుంది సమస్యలను పరిష్కరించేందుకు అనివార్యంగా సంఘటితం కావాల్సిన పరిస్థితి ఎదురవుతుంది జర్నలిస్టుల సమస్యలపై సుదీర్ఘకాలంగా పోరాడుతూ అనేక సత్ఫలితాలను, విజయాలను సాధించిన జర్నలిస్టుల సంఘం టియుడబ్ల్యూజే (ఐజేయు) మండల స్థాయి డివిజన్ స్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్ర శాఖలో కలుపుకొని జాతీయస్థాయిలో నే అతిపెద్ద సంఘంగా విస్తరించి గ్రామీణ ప్రాంత విలేకరుల అక్రిడేషన్ సౌకర్యం, బస్సు పాసులు, ఇండ్ల స్థలాల కోసం పోరాడుతుంది జర్నలిస్టుల సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే దిశగా టియుడబ్ల్యూజే (ఐ జె యు) నిరంతరం విలేకరుల పక్షాన పోరాటం చేస్తుంది ఆదివారం నాడు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పలువురు విలేకరులు హాజరై సభ్యత్వాన్ని స్వీకరించారు, ఈ కార్యక్రమంలో పాత్రికేయులు షేక్ రసూల్, దర్శనం రాంబాబు, పోదిల నాగరాజు, షేక్ మౌలాలి వల్లపుదాసు రమేష్, తిరుమలేష్, గంట రవి, బొంగర్ల శ్రీను, బొల్లికొండ సైదులు, రామకృష్ణ, షేక్ అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన పేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 17, తెలంగాణ పత్రిక




మహారాష్ట్ర నుంచి వలస వచ్చి స్థానికంగా నివసిస్తున్న పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బియ్యం, నూనె, పప్పులు, ఉప్పు వంటి అవసరమైన సరుకులను అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు తోడ్పాటుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆవుల లక్ష్మారెడ్డి, ఎర్ర వైద్యం అనిల్, గూడ రాజు, సాయికుమార్ తదితరులు పాల్గొని సహాయ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రీ రంగనాథ స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించిన రవి కుమార్ యాదవ్

తెలంగాణ పత్రిక న్యూస్ ప్రతినిధి శేర్లింగంపల్లి మే 17.






బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంటెస్టేడ్ ఎమ్మెల్యే, మారబోయిన శ్రీ రవికుమార్ యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ శ్రీ వి. గంగాధర్ రెడ్డి తో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి గ్రామం లోనీ శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా దేవాలయంలో అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించగా, రవికుమార్ యాదవ్ ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవ చేయాలని నాయకులు ఆకాంక్షించారు.గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ.రవికుమార్ యాదవ్ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేసే నాయకుడని, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. అలాగే ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు ముందు ముందు మరెన్నో జరుపుకోవాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని రవికుమార్ యాదవ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో భారీ అగ్ని ప్రమాదం...!

మే 17, తెలంగాణ పత్రిక :



నల్లగొండ జిల్లాలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్లో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్లాంట్ లోని యూనిట్–3 పరిధిలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది భయాందోళనకు గురయ్యారు .ప్రమాదం జరిగిన వెంటనే ప్లాంట్ ఆవరణ అంతా దట్టమైన పొగతో కమ్ముకుపోయింది. ప్రాథమిక సమాచారం ప్రకారం. టర్బైన్ డ్రైవెన్ బాయిలర్ ఫీడ్ పంప్ ప్రాంతం లో ఈ అగ్ని ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది.పంప్ వద్ద ఆయిల్ లీకేజీ జరగడం వల్లే మంటలు చెలరేగినట్లు అధికారులు ప్రాథమికంగా అనుమాని స్తున్నారు. భారీ ఉష్ణోగ్రతలు ,యంత్రాల వేడి కారణంగా లీకైన ఆయిల్ మంటలకు ఆహుతై ఉండ వచ్చని భావిస్తున్నారు. అగ్నిప్రమాదం తీవ్రతతో కంట్రోల్ కేబుల్స్, కొన్ని వాల్వ్‌లు దెబ్బతిన్నట్లు సమాచారం.అయితే ప్రధాన టర్బైన్,బాయిలర్ వంటి కీలక యంత్రాలకు పెద్ద ప్రమాదం తప్పినట్లు తెలుస్తోంది.దీంతో పెద్ద స్థాయి సాంకేతిక నష్టం తప్పిందని అధికారులు ఊపిరి పీల్చుకు న్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్లాంట్ లోని భద్రతా సిబ్బంది అప్రమ త్తమై ఫైర్ సేఫ్టీ వ్యవస్థలను ప్రారంభించారు.అనంతరం అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు.పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తెచ్చేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. అగ్ని ప్రమాద సమయంలో యూనిట్‌లో పనిచేస్తున్న సిబ్బందిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు సమాచారం.ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు.అయితే ప్రమాద తీవ్రత, యంత్రాల నష్టం,విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం వంటి అంశాలపై అధికారులు పూర్తిస్థాయి అంచనా వేస్తున్నారు.ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు సమాచారం.ఆయిల్ లీకేజీ ఎలా జరిగింది? భద్రతా ప్రమాణాల్లో ఏమైనా లోపాలు ఉన్నాయా? అనే అంశాలపై సాంకేతిక బృందాలు పరిశీలి స్తున్నాయి. తెలంగాణలో అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఒకటైన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకోవడం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది.

# బండి భగీరథ్ కేసులో హైకోర్టు జడ్జిపై ట్రోలింగ్.. కేసు నమోదు



మే 17, తెలంగాణ పత్రిక :

పోక్సో కేసులో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ అరెస్టయ్యారు.అతడికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే మహిళా జడ్జి జస్టిస్ మాధవీ దేవిపై సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు అనుచిత వ్యాఖ్యలు చేశారు.ఈ ఆరోపణలపై చార్మినార్ పోలీసులకు తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ ఫిర్యాదు చేశారు.దీనిపై కేసు నమోదు చేసిన చార్మినార్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్ అరెస్ట్‌కు రంగం సిద్ధమైంది. దీంతో అతడు ముందస్తు బెయిల్, అరెస్ట్ నుంచి రక్షణ కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు.వీటిని హైకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే.అయితే ఈ కేసు విచారణలో బండి భగీరథ్‌కి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే జస్టిస్ మాధవీ దేవి భర్తకు బార్ కౌన్సిల్ చైర్మన్ పోస్ట్ ఇస్తారంటూ సోషల్ మీడియాలో కామెంట్లు వెల్లువెత్తాయి.ఈ బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ఈ అంశాలను మహిళా జడ్జి జస్టిస్ మాధవీ దేవి స్వయంగా ప్రస్తావించినట్లు తెలుస్తోంది.దీని వల్ల న్యాయ వ్యవస్థపై ప్రజలకు అపనమ్మకం ఏర్పడుతుందని హైకోర్టు రిజిస్ట్రార్ వ్యాఖ్యానించారు.మహిళా జడ్జి జస్టిస్ మాధవీ దేవిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో చేసిన విమర్శలను ఆధారాలతో సహా చార్మినార్ పోలీసులకు హైకోర్టు రిజిస్ట్రార్ అందజేసి ఫిర్యాదు చేశారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు బండి భగీరథ్ పోక్సో కేసులో బాధిత బాలిక,ఆమె తల్లిదండ్రుల ఫొటోలు,వీడియోలు వైరల్ చేసిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.కొన్ని సోషల్ మీడియా చానళ్లు..బాధిత కుటుంబ వివరాలన బహిర్గతమయ్యేలా..ఫొటోలు, వీడియోలు ప్రసారం చేశాయి.ఇవి వైరల్‌గా మారడంతో మేడ్చల్-- మల్కాజ్‌గిరి జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.బాలిక,ఆమె కుటుంబ వివరాలు బహిర్గతం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసు ఉన్నతాధి కారులు హెచ్చరించారు. ఇప్పటికే పలు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ అకౌంట్లను గుర్తించి అందుకు సంబంధించిన యూఆర్ఎల్‌లను ఉన్నతాధి కారులకు పంపించారు. ఖాతాలను నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. బాధితురాలి గోప్యతకు భంగం కలిగిస్తే శిక్ష తప్పదని పోలీసులు హెచ్చరించారు.సోషల్ మీడియాలో ఇలాంటి పోస్టులను షేర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

# కష్టపడి చదివితే ఎంచుకున్న లక్ష్యాలను సాధించవచ్చు





– జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మే 17, తెలంగాణ పత్రిక:

విద్యార్థులు కష్టపడి చదివితే ఎంచుకున్న లక్ష్యాలను సాధించవచ్చు అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక–99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆదివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యా వారోత్సవాలు–విద్య విజయోత్సవ దినోత్సవం కార్యక్రమాని కి జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, అధికారులతో కలిసి హాజర య్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలను త్రాగునీరు,విద్యుత్, మూత్రశాల లు, ప్రహరీ గోడ, అదనపు గదులు ఇతర సదుపాయాలు కల్పించి మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.విద్యార్థులు పైతరగతులలో మరింత నిబద్ధత, క్రమశిక్షణతో ఉన్నత విద్యను అభ్యసించాలని, ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలని,కష్టపడి చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చు అని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు.10వ తరగతి, ఇంటర్మీడియట్, క్రీడా విభాగాలలో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులు ఈ విజయమే అంతిమం అనుకోకూడదు అని, భవిష్యత్తులో మరింత కృషి చేస్తూ ఎంచుకున్న రంగాలలో విజయం సాధించాలని తెలిపారు. జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరంలో 91.4 శాతం,2024–25 లో 96.54 శాతం, 2025–26 లో 97.20 శాతం ఫలితాలు సాధించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు,ఆదర్శ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల విద్యార్థులు అన్ని రంగాలలో ముందుంటున్నారని, ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడ్పాటుతో సాధ్యమైందని తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 1 లక్ష 27 వేలు ఉండగా 2025–26 విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య 5000 పెరిగి 1 లక్ష 32 వేలుగా నమోదు అయిందని, తద్వారా 3.75 శాతం విద్యార్థుల సంఖ్య పెరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు అద్భుతంగా పని చేస్తున్నాయనడానికి విద్యార్థుల సంఖ్య, ఉత్తమ ఫలితాలు నిదర్శనమని తెలిపారు. అనంతరం జిల్లాలో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన 10వ తరగతి, ఇంటర్మీడియట్, క్రీడా విభాగాల విద్యార్థులను సన్మానించి ప్రభుత్వం ప్రకటించిన ఒక్కొక్కరికి 10వేల రూపాయల నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రము, జ్ఞాపికలను అందజేశారు. అమ్మకు అక్షరమాల (ఉల్లాస్) కార్యక్రమంలో విశేషంగా సేవలు అందించిన వాలంటీర్లకు, రాష్ట్రస్థాయిలో కళా వైభవం,హస్త కళలలో జిల్లా నుండి పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను సన్మానించి ప్రశంస పత్రాలు,జ్ఞాపిక లు అందజేశారు.ప్రభుత్వ.స్థానిక సంస్థల పాఠశాలల్లో 10వ తరగతిలో లసెట్టి శ్వేత (582),జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిష్టాపూర్,జాడి ఆంజనేయ ప్రసాద్ (577),జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కలమడుగు,కట్ల సాకేత (577),జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిష్టాపూర్ సాధించారని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం,ఆదర్శ పాఠశాలల విభాగంలో ఇంటర్మీడియట్ ఫలితాలలో మెండు అమూల్య(992) ఎం.పి.సి., తెలంగాణ మోడల్ స్కూల్ మంచిర్యాల,కొమ్మల స్వతంత్ర (992) ఎం.పి.సి.తెలంగాణ మోడల్ స్కూల్ కాసిపేట, నక్క ఊర్వశి (991) బై.పి.సి.,కేజీబీవీ మంచిర్యాల,అలిపి రెడ్డి వైశాలి (966), తెలంగాణ మోడల్ స్కూల్– మంచిర్యాల, పాల్వ స్రవంతి (986), కేజీబీవీ–తాండూర్,ఎం పి హెచ్ డబ్ల్యు విభాగం సాధించారని తెలిపారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విభాగంలో గుడిమల్ల శ్రీ వర్షిని, 9వ తరగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆస్నాద్ –అండర్ 17–వాలీబాల్ లో జాతీయస్థాయి, గాలి పెల్లి అను,9వ తరగతి,, తెలంగాణ మోడల్ స్కూల్ మందమర్రి, అండర్ 17 ఫుట్ బాల్ జాతీయస్థాయి,కారు విష్ణు 8వ తరగతి,జిల్లా పరిషత్ బాలికల పాఠశాల బెల్లంపల్లి, అండర్ 14 సాఫ్ట్ బాల్,జాతీయ స్థాయిలో ఫలితాలు సాధించారని తెలిపారు.హస్త కళలు, సాంస్కృతిక దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు నిర్వహించిన పోటీలో మంచిర్యాల జిల్లా నుండి రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంస పత్రాలు పొందిన బండ శాంకరి,స్కూల్ అసిస్టెంట్,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్యంపల్లి, కాసిపేట మండలం, సుంకరి లక్ష్మి, స్కూల్ అసిస్టెంట్, ఎంపి, యు.పి.యస్. రదగంబాల బస్తి, బెల్లంపల్లి మండలం, బొలిశెట్టి బుచ్చన్న, ఎస్ జి టి,ఎంపీపీఎస్ గుడి రేవు,దండేపల్లి మండలం, ఏ.వెంకటరాజమ్మ, ఎస్జీటీ ఎంపీపీఎస్, విద్యానగర్,మందమర్రి మండలం లను జ్ఞాపిక, ప్రశంసా పత్రాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్తలు ముత్యబోయిన భరత్ కుమార్,జంబోజు సత్తయ్య ,కె.విజయలక్ష్మి, కుమ్మరి కృష్ణమూర్తి, అడిచెర్ల రాజ్ కుమార్, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# అర్ధరాత్రి బస్ స్టాప్‌లో ఒంటరిగా నిలబడిన మహిళ పై కేవలం 3 గంటల్లో 40 మంది పురుషులు?

- ఇదేనా మన సమాజం?
- ఆ మహిళ ఎవరు? ఈ తనిఖీ ఉద్దేశ్యంఏమిటి?
- మన సమాజంఎందుకింత దుస్థితిలో ఉంది?
- ఈ అసహ్యకరమైన సంఘటనఎలాజరిగింది?
- ఈ ఘటన తర్వాత, మహిళల భద్రత కోసం హైదరాబాద్ పోలీసులు కఠినచర్యలు
- ఈ ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తం గా పెద్ద చర్చ?

మే 17, తెలంగాణ పత్రిక

మన దేశంలో, అర్ధరాత్రి ఒంటరిగా నడిచే రోజుకే మహిళలకు నిజమైన స్వేచ్ఛ లభిస్తుంది అనే నానుడిని మనం నిరంతరం వింటూ ఉంటాం. అయితే, హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ఒక సంఘటన ఈ మాట ఎంత అసంబద్ధమైనదో మనకు తెలియజేసింది. రోడ్డు పక్కన నిలబడిన ఒక మహిళను మన సమాజంలోని కొందరు పురుషులు ఎంత వక్రీకరించిన దృష్టితో చూస్తారో అనడానికి ఈ సంఘటన ఒక నిదర్శనం.

ఈ అసహ్యకరమైన సంఘటన ఎలాజరిగింది?

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో, అర్ధరాత్రి దాటాక ఒక మహిళ రోడ్డు పక్కన ఉన్న బస్ స్టాప్‌లో ఒంటరిగా బస్సు కోసం ఎదురుచూస్తోంది. ఆమె సుమారు రాత్రి 12 గంటల నుండి తెల్లవారుజామున 3 గంటల వరకు అక్కడే ఉంది. ఆ మూడు గంటల్లో జరిగినది నిజంగా అసహ్యకరమైనది భయంకరమైనది. కేవలం మూడు గంటల్లోనే, సుమారు 40 మంది పురుషులు దుష్ట దృష్టితో ఆమె వైపు వచ్చారు. కొందరు తమ కార్లను ఆపి, వస్తున్నావా? అని అడగ్గా, మరికొందరు అసభ్యంగా సైగలు చేశారు. బైకర్లు, ఆటో డ్రైవర్లతో సహా వరుసగా వచ్చిన ఆ పురుషులు, ఆమెను ఒక మహిళ గా చూడకుండా, ఒంటరిగా దొరికిన ఒక వస్తువులా చూశారు.

ఆ మహిళ ఎవరు? ఈ తనిఖీ ఉద్దేశ్యంఏమిటి?

కానీ ఆ వ్యక్తులకు తెలియని ఒక నిజం ఉంది. అక్కడ నిలబడిన మహిళ ఒక సాధారణ మహిళ





కాదు. ఆమె తెలంగాణకు చెందిన ఐపీఎస్ అధికారిణి వి. సుమతి. హైదరాబాద్‌లో మహిళల భద్రతపై నిజానిజాలు తెలుసుకోవడానికి ఆమె క్షేత్రస్థాయి పరిశీలన (ఫీల్డ్ సర్వే) నిర్వహిస్తున్నారు. పోలీస్ శాఖలో ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ, ఆమె ఆ రోజు ఒక సాధారణ మహిళలా దుస్తులు ధరించి రోడ్డుపైకి వచ్చారు. సాధారణ దుస్తులలో ఉన్న ఇతర పోలీసు అధికారులు ఆమెకు దూరంగా కాపలాగా ఉన్నారు. ఒక అధికారిణికే ఇలాంటి పరిస్థితి ఎదురైతే, ఇక సాధారణ అమ్మాయిల గతి ఏమిటనే పెద్ద ప్రశ్న ఇప్పుడు అందరినీ వేధిస్తోంది.

మన సమాజంఎందుకింత దుస్థితిలో ఉంది?

ఈ ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా పెద్ద చర్చ మొదలైంది.

1.మానసికస్థితి మారాలి

హైదరాబాద్ వంటి హైటెక్ నగరంలో కూడా మహిళలను గౌరవించని పురుషులు ఉన్నారు, అలాంటప్పుడు మనం ఎక్కడ తడబడుతున్నాం? ఒంటరిగా నిలబడిన మహిళను వేధించడానికి మాటువేసి ఉండే ఈ లక్షణం నిజంగా సిగ్గుచేటు.

2.పోలీసు గస్తీ అవసరం

ఐపీఎస్ అధికారిణి సుమతి చేపట్టిన ఈ ఆపరేషన్ వల్ల ఈరోజు చాలా మంది సెక్స్ వర్కర్లు పట్టుబడ్డారు. కానీ పోలీసులు ప్రతిరోజూ ప్రతి వీధిలో ఉండలేరు. అందువల్ల, సీసీటీవీ కెమెరాలను, నిరంతర గస్తీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

3.సామాజిక బాధ్యత

రోడ్డుపై ఎవరైనా మహిళను వేధిస్తే, దానిని ప్రశ్నించే ధైర్యాన్ని మనం పెంపొందించుకోవాలి. మౌనంగా ఉండటం కూడా ఆ నేరానికి మద్దతు ఇచ్చినట్లే!

మార్పు మనతోనే మొదలవ్వాలి

ఐపీఎస్ అధికారిణి సుమతి ధైర్యసాహసాలను అందరూ ప్రశంసిస్తున్నారు. ఆఫీసులో కూర్చుని రిపోర్ట్ చదవకుండా, ఆమె నేరుగా రోడ్డుపైకి వచ్చి అసలు నిజం ఏమిటో చూపించింది ఈ ఘటన తర్వాత, మహిళల భద్రత కోసం హైదరాబాద్ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. కానీ చట్టం ఒక్కటే అన్నీ మార్చలేదు. ఇంట్లోని అబ్బాయిలకు అమ్మాయిల ను గౌరవించడం నేర్పించాలి రోడ్డుపై ఒంటరిగా కనిపించే అమ్మాయి అభద్రతకు గురికాకుండా చూడటం ప్రతి పౌరుడి కర్తవ్యం.

సారాంశం

ఈ కథనం హైదరాబాద్‌లో మహిళల భద్రతపై జరిపిన ఒక దిగ్భ్రాంతికరమైన వాస్తవ పరిశీలనను వివరిస్తుంది.

ప్రధాన పాత్ర:

ఐపీఎస్ అధికారిణి సుమతి

కథ

మహిళల భద్రతను తనిఖీ చేయడానికి ఆమె అర్ధరాత్రి ఒంటరిగా ఒక బస్ స్టాండ్‌లో నిలబడినప్పుడు, 3 గంటల వ్యవధిలో 40 మంది పురుషులు ఆమెతో అసభ్యంగా ప్రవర్తించారనే నిజం బయటపడుతుంది.

శైలి


ఒక సాధారణ పౌరుడు సమాజం పట్ల తన ఆందోళనను, ఆగ్రహాన్ని వ్యక్తపరిచే విధంగా సరళమైన కన్నడలో వ్రాయబడింది.

సందేశం

ఈ కథనం కేవలం సంఘటన వివరించడమే కాకుండా, సమాజపు ఆలోచనా విధానం మారాలని, మహిళల భద్రత కోసం కఠినమైన చట్టాలను అమలు చేయాలనే సందేశాన్ని కూడా ఇస్తుంది.


## బిజినెస్

## మళ్లీ నష్టాల్లోకి మార్కెట్లు



వరుసగా రెండు రోజులు లాభాల బాటలో సాగిన దేశీయ ప్రామాణిక ఈక్విటీ సూచీలు శుక్రవారం మళ్లీ నష్టాలతో ముగిశాయి. మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస‌యూ బ్యాంకుల షేర్లలో అమ్మకాలతో పాటు ముడి చమురు ధరల పెరుగుదల నేపథ్యంలో ఇన్వెస్టర్ల అప్రమత్తత స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగియడానికి కారణమయ్యాయి. బీఎసఈ సెన్సెక్స్ లాభనష్టాల మధ్య ఊగిసలాడి 160.73 పాయింట్ల నష్టంతో 75,237.99 వద్ద ముగిసింది. ప్రారంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ దాదాపు 470 పాయింట్ల మేర దూసుకుపోయింది. ఇక ఎన్ఎసఈ నిఫ్టీ 46.10 పాయింట్ల నష్టంతో 23,643.50 వద్ద ముగిసింది. బంగారం రూ.3,200..వెండి రూ.21,600 తగ్గాయ్..: బంగారం, వెండి ధరలు దిగొచ్చాయి. ఢిల్లీ మార్కెట్లో శుక్రవారం 10 గ్రాముల బంగారం (99.9 శాతం స్వచ్ఛత) ధర రూ.3,200 తగ్గి రూ.1,62,800కు చేరుకోగా.. కిలో వెండి ధర రూ.21,600 తగ్గి రూ.2.75 లక్షలకు చేరుకున్నట్టు అఖిల భారత సరాఫా అసోసియేషన్ పేర్కొంది. డాలర్ బలపడటం, ఇన్వెస్టర్లు భారీగా లాభాల స్వీకరణకు దిగడంతో ఈ రెండు లోహాల ధరలు దిగివచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) స్పాట్ గోల్డ్ ధర 104 డాలర్లకు పైగా తగ్గి 4,548.46 డాలర్లు, ఔన్స్ వెండి ధర 5.26 డాలర్లు తగ్గి 78.21 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

# ప్రపంచంలో అతిపెద్ద ఏఐ టెక్ కంపెనీగా టీసీఎస్




ప్రపంచంలో అతిపెద్ద ఏఐ ఆధారిత టెక్నాలజీ సేవల కంపెనీగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు టీసీఎస్ సీఈఓ, ఎండీ కే కృతివాసన్ తెలిపారు. తమ టాప్ 139 క్లయింట్లలో ఇప్పటికే 130 మంది తమ ఏఐ సేవల భాగస్వామిగా టీసీఎస్‌ను ఎంచుకున్నారని 2025-26 ఆర్థిక సంవత్సర నివేదికలో పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరాన్ని (2025-26) ఎంటర్‌ప్రైస్ ఏఐ సేవల పరివర్తన కాలంగా ఆయన అభివర్ణించారు. ఈ సాంకేతిక మార్పుకు అనుగుణంగా తమ సిబ్బందికి ఏఐ వంటి ఆధునిక నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తున్నామన్నారు. ఇప్పుడు సంస్థలో 2.70 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఏఐ నైపుణ్యాలను కలిగి ఉన్నారని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఏఐ నైపుణ్యం కలిగిన సిబ్బంది మూడింతలయ్యారని వార్షిక నివేదికలో కృతివాసన్ ప్రస్తావించారు.

### మేధో మౌలిక వసతిగా ఏఐ: చంద్రశేఖరన్

కృత్రిమ మేధ(ఏఐ) కేవలం సాంకేతిక కాదని ప్రపంచవ్యాప్తంగా సంస్థలకు మేధో మౌలిక వసతిగా మారుతోందని దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు. టీసీఎస్ 'హ్యూమన్ ప్లస్ ఏఐ' ఆపరేటింగ్ మోడల్‌ను విస్తరిస్తున్నదని, ఏఐ సేవల ద్వారా 230 కోట్ల డాలర్లు.. క్లౌడ్, డేటా, సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునిక సేవల ద్వారా 1,150 కోట్ల డాలర్ల వార్షిక ఆదాయాన్ని సాధించిందని కంపెనీ 2025-26 ఆర్థిక సంవత్సర నివేదిక ద్వారా వాటాదారులకు తెలిపారు. సంస్థల పెట్టుబడులు, సరఫరా వ్యవస్థ నిర్వహణ, రిస్క్ మేనేజ్‌మెంట్, సంబంధిత వర్గాలకు సేవలందించే తీరును ఏఐ సమూలంగా ప్రభావితం చేయనుందన్నారు. ఈ నేపథ్యంలో కంపెనీ అత్యంత భద్రమైన, చురుకైన, చట్టబద్ధమైన ఏఐ మౌలిక వసతిని ఏర్పాటు చేయాలనుకుంటోందన్నారు. ఏజెంటిక్ ఏఐ పరిష్కారాలందించే ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఇండస్ట్రీల అవసరాలకు అనుగుణమైన ఏఐ ఆపరేటింగ్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయనున్నట్లు చంద్రశేఖరన్ తెలిపారు. కృతివాసన్‌కు రూ.28 కోట్ల పారితోషికం: టీసీఎస్ సారథిగా కృతివాసన్ గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.28 కోట్ల పారితోషికం అందుకున్నారు. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2024-25) తో పోలిస్తే ఆయన ప్యాకేజీ 6.3 శాతం పెరిగింది. టీసీఎస్ చైర్మన్‌గా చంద్రశేఖరన్ మాత్రం కంపెనీ నుంచి ఎలాంటి కమీషన్ తీసుకోలేదు. పూర్తి ఏడాది కాలానికి సిట్టింగ్ ఫీజు కింద ఆయనకు కేవలం రూ.4.2 లక్షలు లభించాయి.

### ఏఎస్ఎంఎల్‌తో టాటా ఎలక్ట్రానిక్స్ జట్టు

భారత్‌లో సెమీకండక్టర్ల (చిప్) తయారీ కోసం టాటా ఎలక్ట్రానిక్స్ నెదర్లాండ్స్‌కు చెందిన చిప్ యంత్రాల దిగ్గజం ఏఎస్ఎంఎల్‌తో చేతులు కలిపింది. ప్రధాని మోదీ నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా ఈ భాగస్వామ్యం కుదిరింది. ఇందులో భాగంగా గుజరాత్‌లోని ధోలెరాలో టాటా ఎలక్ట్రానిక్స్ చిప్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ఏఎస్ఎంఎల్ సహకరించనుంది.

# నవ లిమిటెడ్ లాభంలో 55 శాతం క్షీణత




గడచిన ఆర్థిక సంవత్సరం (2025-26) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో నవ లిమిటెడ్.. రూ.1,194.80 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.136.30 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2024-25) ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 13.2 శాతం (రూ.1,055.80 కోట్లు) వృద్ధి చెందగా లాభం 55 శాతం (రూ.302.80 కోట్లు) క్షీణించింది. స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన మాత్రం రూ.614.30 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.478.10 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతకు ముందు ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 16.3 శాతం, లాభం ఏకంగా 392.3 శాతం వృద్ధి చెందింది. పటిష్ఠమైన నిర్వహణా సామర్థ్యం, డివిడెండ్, షేర్ బైబ్యాక్ ద్వారా నగదు రావటంతో స్టాండ్‌ఎలోన్ ఆదాయం, లాభం గణనీయంగా పెరిగిందని నవ లిమిటెడ్ పేర్కొంది. కాగా రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.5.50 (550) తుది డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది.

# ఇందన పొదుపు: ప్రేక్షకుల్లేకుండా ఐపీఎల్ నిర్వహిస్తారా కేంద్రానికి సీటీఐ ప్రతిపాదనలు



ప్రస్తుతం సాగుతున్న ఐపీఎల్ 2026 సీజన్‌ను పునర్వ్యవస్థీకరించాలని 'ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖను కోరింది. ఇంధన ఆదా కోసం మిగిలిన మ్యాచ్‌లను ప్రేక్షకుల్లేకుండా కొన్ని పరిమిత వేదికల్లోనే నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయకు లేఖ రాశారు. ఇటీవల దేశీయంగా లీటరు ఇంధనంపై 3 రూపాయల మేర పెరిగిన నేపథ్యంలో ఈ టోర్నమెంట్ వల్ల పర్యావరణం, ఇంధన నిల్వలపై ప్రభావం పడుతోందని సీటీఐ తన లేఖలో ప్రస్తావించింది. ఐపీఎల్ జట్లు నిరంతరం ఒక నగరం నుంచి మరో నగరానికి ప్రయాణించడం వల్ల ఇంధన నిల్వలు భారీగా ఖర్చవుతున్నాయని సీటీఐ ఆందోళన వ్యక్తం చేసింది. ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఉపయోగించే బోయింగ్ 737, ఎయిర్‌బస్ ఏ320 చార్టర్డ్ విమానాలు గంటకు 2,400 నుంచి 3,000 లీటర్ల ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్‌ను వినియోగిస్తాయని గుర్తు చేసింది. ఒక్కో జట్టు ఈ సీజన్‌లో దాదాపు 10 విమాన ప్రయాణాలు చేస్తుందని, దీనివల్ల ఒక్కో ఫ్రాంచైజీ 50 వేల నుంచి 70 వేల లీటర్ల ఇంధనాన్ని వినియోగిస్తోందని బ్రిజేష్ గోయల్ లెక్కలతో వివరించారు. పైగా ఒక్కో మ్యాచ్‌ను చూడటానికి దాదాపు 50 వేల మంది వరకు ప్రేక్షకులు స్టేడియాలకు వస్తుంటారని గుర్తు చేశారు. వీళ్లు వాడే వాహనాల వల్ల రోజూ వేల లీటర్ల పెట్రోల్, డీజిల్ వృథా అవుతోందని తెలిపారు. గతంలో కరోనా మహమ్మారి సమయంలో బయో-బబుల్ విధానంలో పరిమిత వేదికల్లో ఐపీఎల్‌ను విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని సీటీఐ గుర్తు చేసింది.

## వెంకటేష్ అయ్యర్ ఫైర్, కోహ్లీ ఫిఫ్టీ... ఆర్సీబీ భారీ స్కోరు... పంజాబ్ కు పెను సవాల్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ, నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగుల భారీ స్కోరు సాధించింది. వెంకటేశ్ అయ్యర్ (73 నాటౌట్), విరాట్ కోహ్లీ (58) అద్భుత హాఫ్ సెంచరీలతో చెలరేగారు. ధర్మశాల వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పంజాబ్ కెప్టెన్ బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే, ఆ జట్టు బౌలర్ల ప్రణాళికలను ఆర్సీబీ బ్యాటర్లు పూర్తిగా చిత్తుచేశారు. ఓపెనర్ జాకబ్ బెతెల్ (11) త్వరగానే ఔటైనా, ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు పంజాబ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. విరాట్ కోహ్లీ తన ఫామ్‌ను కొనసాగిస్తూ 37 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 58 పరుగులు చేశాడు. మరోవైపు దేవదత్ పడిక్కల్ (45), కేవలం 25 బంతుల్లోనే మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కోహ్లీ, పడిక్కల్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన వెంకటేష్ అయ్యర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 40 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 73 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. చివర్లో టిమ్ డేవిడ్ (12 బంతుల్లో 28) కూడా తన వంతుగా మెరుపులు మెరిపించడంతో ఆర్సీబీ స్కోరు 220 మార్కును దాటింది. అర్ధ సెంచరీ పూర్తయ్యాక వెంకటేష్ అయ్యర్.. దళపతి విజయ్ (ప్రస్తుతం తమిళనాడు సీఎం) తరహాలో రెండు చేతులు క్రాస్ చేస్తూ సెలబ్రేట్ చేసుకోవడం విశేషం. పంజాబ్ బౌలర్లలో ఒక్క హర్‌ప్రీత్ బ్రార్ మాత్రమే ఆకట్టుకున్నాడు. అతను 4 ఓవర్లలో 35 పరుగులిచ్చి 2 కీలక వికెట్లు పడగొట్టాడు. మిగతా బౌలర్లందరూ భారీగా పరుగులు సమర్పించుకున్నారు. అర్షదీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్ చెరో వికెట్ తీసినప్పటికీ, పరుగులను నియంత్రించడంలో విఫలమయ్యారు. ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించడానికి పంజాబ్ బ్యాటర్లు అసాధారణ ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. ఈ మ్యాచ్ లో గెలుపు పంజాబ్ కు చాలా అవసరం. ప్లే ఆఫ్ సమీకరణాలు అత్యంత సంక్లిష్టంగా మారిన తరుణంలో ఇక ప్రతి మ్యాచ్ లోనూ గెలుపు తప్పనిసరి. నేటి మ్యాచ్ లో ఆర్సీబీ గనుక గెలిస్తే, ఆ జట్టు ప్లే ఆఫ్ దశలోకి దూసుకెళ్లే అవకాశం ఉంది.

## స్పోర్ట్స్

### అఫ్ఘాన్ స్టార్ ప్లేయర్ రహ్మత్ షా చనిపోయాడా?

## సోషల్ మీడియాలో వార్త వైరల్



అఫ్గానిస్థాన్ స్టార్ క్రికెటర్ రహ్మత్ షా చనిపోయినట్లు సోషల్ మీడియాలో ఓ వార్త తెగ వైరల్ అవుతోంది. 32 ఏళ్ల రహ్మత్ షా మరణించాడంటూ 'ఎక్స్' వేదికగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదు. ఆయన పూర్తిగా క్షేమంగా ఉన్నట్లు తేలింది. అఫ్ఘాన్ ఆల్‌రౌండర్ కరీమ్ జనత్ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఒక పోస్ట్ వల్ల ఈ గందరగోళం మొదలైంది. రహ్మత్ షా తల్లి మరణించడంతో ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కరీమ్ జనత్ పష్తో భాషలో పోస్ట్ పెట్టారు. ఆ పోస్టుకు రహ్మత్ షా ఫొటోను జత చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఉన్న ఆటోమేటిక్ ట్రాన్స్‌లేషన్ ఫీచర్ ఆ పష్తో సందేశాన్ని ఇంగ్లీషులోకి తప్పుగా అనువదించింది. రహ్మత్ షా తల్లి చనిపోయారనే విషయాన్ని మార్చేసి,రహ్మత్ షానే చనిపోయాడంటూ తప్పుడు అర్థం వచ్చేలా చూపించింది. దీంతో అభిమానులు కంగారుపడి ఆ వార్తను వైరల్ చేశారు. రహ్మత్ షా గత ఏడాది అక్టోబర్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అఫ్గానిస్థాన్ తరఫున చివరిసారిగా ఆడాడు. ఆ సిరీస్‌లో గాయం కారణంగా అతడు చివరి మ్యాచ్‌కు దూరమయ్యాడు. ప్రస్తుతానికి ఆరోగ్యంగానే ఉన్నాడు. కేవలం ఇన్‌స్టాగ్రామ్ యాప్ చేసిన తప్పు అనువాదం వల్లే ఈ ఫేక్ న్యూస్ ప్రచారంలోకి వచ్చింది.

# విజయ్ నాకు సమవుజ్జీ కాదు.. రజినీకాంత్ సంచలన వ్యాఖ్యలు




తమిళనాడు ప్రజలు మార్పు కోరుకున్నారని.. అందుకే విజయ్ గెలిచారని స్టార్ హీరో రజినీకాంత్ అన్నారు. తనకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదన్నారు. తానే గనక పార్టీ పెడితే కచ్చితంగా గెలిచేవాడినన్నారు. డీఎంకే అధినేత స్టాలిన్ తనకు మంచి స్నేహితుడని తెలిపారు. అందుకే ఆయన్ని కలిసినట్లు వెల్లడించారు. ఎన్నికల ఫలితాల అనంతరం స్టాలిన్‌ను కలిసిన నేపథ్యంలో రజినీపై విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఆదివారం చెన్నైలోని తన నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరణ ఇచ్చారు. మరోవైపు విజయ్ సీఎంగా గెలవకూడదని తాను ఎలాంటి ప్రయత్నం చేయలేదని రజినీకాంత్ చెప్పారు. విజయ్‌ను తనకు సమవుజ్జీగా భావించడం లేదన్నారు. తమ వయసులో 28 ఏళ్ల వ్యత్యాసం ఉందన్నారు. కమల్ హాసన్ సీఎం అయితే అసూయ పడతాను గానీ, విజయ్ విషయంలో అలాంటిదేమీ లేదన్నారు. రెండు ప్రధాన పార్టీలను ఢీకొని గెలిచిన విజయ్‌కు తాను శుభాకాంక్షలు తెలిపానని గుర్తుచేశారు. ఇటీవల ఎయిర్‌పోర్టులో ఓ వ్యక్తి విజయ్ గురించి ప్రస్తావించగా రజినీకాంత్ నవ్వుతూ వెళ్లిపోయిన విషయం తెలిసిందే. దీనిపై విమర్శలు రావడాన్నీ రజినీ తాజాగా ప్రస్తావించారు. ఎవరో వ్యక్తి ఫోన్‌లో రికార్డు చేస్తూ అడిగిన ప్రశ్నకు తాను స్పందించలేదన్నారు. తాను అనవసరంగా ఇతర విషయాల గురించి మాట్లాడే వ్యక్తిని కాదన్నారు.

# రేపటి నుంచే 'పెద్ది' పోరాటం...

## ముంబైలో ట్రైలర్ టేకోవర్ కు అంతా రెడీ!

- రేపు ముంబైలో 'పెద్ది' ట్రైలర్ విడుదల
- రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా బుచ్చిబాబు దర్శకత్వం
- జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా సినిమా రిలీజ్
- ట్రైలర్‌కు ముందు జగపతి బాబు క్యారెక్టర్ గ్లింప్స్ విడుదల
- ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న పాన్-ఇండియా చిత్రం



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న భారీ చిత్రం 'పెద్ది'. ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ రేపటి నుంచి ఫుల్ స్పీడ్ లో కొనసాగనున్నాయి. ఈ చిత్రం ట్రైలర్‌ను మే 18న ముంబైలో ఒక గ్రాండ్ ఈవెంట్ లో విడుదల చేసేందుకు సర్వం సిద్ధమైంది. "అతడి పోరాటం రేపటి నుంచి మొదలు" అనే క్యాప్షన్‌తో పెద్ది టీమ్ ప్రచారాన్ని హోరెత్తిస్తోంది. "పెద్ది ట్రైలర్ టేకోవర్" పేరుతో ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్‌లో మే 18న మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ ఈవెంట్ జరగనుంది. ఈ సందర్భంగా సినిమా ట్రైలర్‌ను అభిమానులు, మీడియా సమక్షంలో విడుదల చేయనున్నారు. ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లు, ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. ఈ చిత్రంలో రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా, విజయనగరం నేపథ్యంలో సాగే ఒక గ్రామీణ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ట్రైలర్ విడుదలకు ముందు ప్రమోషన్స్‌ను వేగవంతం చేసిన మేకర్స్, మే 17న నటుడు జగపతి బాబు పాత్రకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసి క్యూరియాసిటీని పెంచారు. ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి', 'రై రై రా రా' పాటలు సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తుండగా, ఓవర్సీస్‌లో ప్రీ-సేల్స్ కూడా భారీ స్థాయిలో జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని జూన్ 4న తెలుగు, హిందీ, తమిళం సహా పలు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# చిరంజీవితో ఊటీలో డ్యాన్స్...

## పాత జ్ఞాపకాలను పంచుకున్న మీనాక్షి శేషాద్రి



ఒకప్పటి బాలీవుడ్ ప్రముఖ నటి మీనాక్షి శేషాద్రి, మెగాస్టార్ చిరంజీవితో తనకున్న పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సుమారు 3 దశాబ్దాల క్రితం చిరంజీవితో కలిసి 'ఆజ్ కా గూండా రాజ్' సినిమా కోసం ఊటీలో చిత్రీకరించిన 'లష్కరా' పాట రోజులను గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. ఆ పాటకు మరోసారి స్టెప్పులేస్తూ ఒక వీడియోను అభిమానులతో పంచుకున్నారు. శుక్రవారం రాత్రి పోస్ట్ చేసిన ఈ వీడియోలో, మీనాక్షి నలుపు రంగు దుస్తుల్లో ఎంతో గ్రేస్‌ఫుల్‌గా డాన్స్ చేస్తూ కనిపించారు. ఈ సందర్భంగా ఆమె చిరంజీవిని ప్రశంసించారు. "చిరంజీవి ఒక గొప్ప నృత్యకారుడు. ఆయనతో కలిసి పనిచేయడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. అందుకే ఆ చిత్రంలో మేమిద్దరం కలిసి చాలా డాన్స్ నంబర్లు చేశాం. 'లష్కరా' పాటను ఊటీలోని అందమైన లొకేషన్లలో చిత్రీకరించాం" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రవిరాజా పినిశెట్టి దర్శకత్వంలో 1992లో వచ్చిన హిందీ యాక్షన్ చిత్రం 'ఆజ్ కా గూండా రాజ్'. ఇందులో చిరంజీవి, మీనాక్షి శేషాద్రి జంటగా నటించారు. అవినీతి, అన్యాయాల పై ఓ సామాన్యుడు చేసే పోరాటమే ఈ చిత్ర కథ. ఈ సినిమాలోని 'లష్కరా' పాట అప్పట్లో పెద్ద హిట్ అయింది.

# తమిళ దర్శకుడు వేధించాడు.. నాపై కేసు పెట్టారు: లావణ్య త్రిపాఠి సంచలన వ్యాఖ్యలు



ప్రముఖ నటి, కొణిదెల వారి కోడలు లావణ్య త్రిపాఠి తన కెరీర్‌లో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని, వ్యక్తిగత జీవిత విశేషాలను పంచుకున్నారు. పెళ్లి తర్వాత 'సతీ లీలావతి' చిత్రంతో తిరిగి ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆమె, తాజాగా ఓ ఇంటర్వ్యూలో పలు సంచలన విషయాలు వెల్లడించారు. చిత్ర పరిశ్రమలో తాను కూడా వేధింపులు ఎదుర్కొన్నానని ఆమె తెలిపారు. కెరీర్ ఆరంభంలో ఓ తమిళ దర్శకుడు తనతో అసభ్యంగా ప్రవర్తించాడనీ దాంతో ఆ సినిమానే వదులుకున్నానని, దీనిపై చిత్రబృందం తన మీద కేసు పెట్టిందన్నారు. అంతటితో ఆగకుండా మీడియాలోనూ తప్పుడు కథనాలు రాయించారని, ఆ ఘటనతో మానసికంగా తాను కుంగిపోయానని తెలిపింది. అలాగే, బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన 'గీత గోవిందం' చిత్రంలో హీరోయిన్‌గా తొలి అవకాశం తనకే వచ్చిందని, అయితే ఆ సమయంలో వేరే సినిమాలతో బిజీగా ఉండటం వల్ల ఆ ఆఫర్‌ను వదులుకోవాల్సి వచ్చిందని లావణ్య వెల్లడించారు. ఇక వరుణ్ తేజ్‌తో తన ప్రేమ, వైవాహిక జీవితం గురించి మాట్లాడుతూ, "ఒక సినిమా వేడుకలో వరుణ్ కళ్లను చూసి ప్రేమలో పడ్డాను. ఆయన చాలా సపోర్టివ్‌గా ఉంటారు. మా మధ్య గొడవ వస్తే తను వాదిస్తాడు, నేను మౌనంగా ఉండిపోతాను. వరుణ్ లాంటి భర్త దొరకడం, మెగా కుటుంబంలోకి రావడం నా అదృష్టం" అని లావణ్య త్రిపాఠి తెలిపారు.

# నడిరోడ్డు పై పావలా శ్యామల.. అండగా నిలిచిన నిర్మాత దిల్ రాజు




తీవ్ర అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతూ నడిరోడ్డుపై నిస్సహాయ స్థితిలో కనిపించిన సీనియర్ నటి పావలా శ్యామలను ఆదుకునేందుకు ప్రముఖ నిర్మాత దిల్ రాజు ముందుకు వచ్చారు. ఆమె దయనీయ పరిస్థితి గురించి సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న ఆయన తక్షణమే స్పందించి ఆమె పూర్తి వైద్య బాధ్యతలను స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. ఒకప్పుడు తన నటనతో తెలుగు ప్రేక్షకులను అలరించిన పావలా శ్యామల ప్రస్తుతం వృద్ధాప్యం, అనారోగ్యంతో బాధపడుతున్నారు. గత రాత్రి చికిత్స కోసం కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా డబ్బు లేదనే కారణంతో యాజమాన్యం చేర్చుకోవడానికి నిరాకరించింది. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న శ్యామల, ఆమె కుమార్తెను క్యాబ్ డ్రైవర్ నడిరోడ్డుపై వదిలేసి వెళ్లిపోయాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆర్కే ఫౌండేషన్ సహాయంతో ఆమెను ఆదుకున్నారు. పావలా శ్యామల దీనస్థితికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం దిల్ రాజు దృష్టికి వెళ్లింది. వెంటనే చలించిపోయిన ఆయన, తన బృందాన్ని అప్రమత్తం చేశారు. పావలా శ్యామల ప్రస్తుతం కూకట్‌పల్లిలోని ప్రసాద్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని తెలుసుకుని, స్వయంగా ఆసుపత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల వివరాల ప్రకారం పావలా శ్యామల పిత్తాశయం (గాల్‌బ్లాడర్) సమస్యతో పాటు, అధిక క్రియాటినిన్ స్థాయులు, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఆమెకు అవసరమైన అన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. "శ్యామలకు అత్యుత్తమ వైద్యం అందించండి. ఖర్చుల గురించి ఆందోళన అవసరం లేదు. పూర్తి బాధ్యత నేను తీసుకుంటాను. నా మేనేజర్లు మీతో టచ్‌లో ఉంటారు" అని దిల్ రాజు వైద్యులకు భరోసా ఇచ్చారు. దిల్ రాజు బృందం ఆసుపత్రికి వెళ్లి శ్యామలను పరామర్శించగా ఆమె భావోద్వేగానికి గురయ్యారు. తనకు అండగా నిలిచిన దిల్ రాజుకు కన్నీటితో కృతజ్ఞతలు తెలిపారు. "దిల్ రాజు మాకు దేవుడితో సమానం. ఆయన కచ్చితంగా సహాయం చేస్తారని అమ్మ ఎన్నోసార్లు చెప్పింది. ఆ నమ్మకమే నిజమైంది" అని పావలా శ్యామల కుమార్తె అన్నారు. కష్టకాలంలో ఉన్న ఒక సీనియర్ కళాకారిణిని ఆదుకోవడానికి దిల్ రాజు చూపిన చొరవ పట్ల సినీ వర్గాలు, నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143